2015 డిసెంబర్

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-

**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత
పోస్ట్‌బాక్స్ నెం. 28
ఒంగోలు - 523001
ఫోన్ : 08592-231281
సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 05 |
| క్రిస్‌మస్ | వాస్తవగాథ | 07 |
| కుమారుని ఎవరు తీసుకుంటారు? | మామయ్య కథలు | 09 |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| యేసు తల్లి మరియ | శ్రీమతి కె. రేచల్‌జోసఫ్‌గారు | 13 |
| రక్షకుని బయలుపరచిన గ్రంథము-బైబిల్ | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 14 |
| రక్షకుడు | శ్రీమతి కమలాసామ్రాట్‌గారు | 15 |
| క్రిస్మస్ ఎక్కడ? | రెవ.డా॥ కె. జోసఫ్‌గారు | 16 |
| పాపుల రక్షకుడేసు | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 17 |
| సువార్తలనుగూర్చి | రెవ.డా॥ కొడవటికంటి విక్రాంత్ | 16 |
| బైబిల్లో పిల్లలు గూర్చి | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | 19 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |


India Evangelistic & Relief Fellowship

| EVANGELISM | RELIEF |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |


**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు క్రిస్మస్ శుభాభివందనములు.

ఈ మాసపత్రికకు మీరు చూపిస్తున్న ఆదరణనుబట్టి వందనములు. దేవుడు మిమ్మును ఆదరించును గాక!

మరీ మరీ చెప్పేదేమంటే అక్షరయజ్ఞంలో పోటీ చేసేవారు 5వ తేదీ లోపల మాకు అందే విధంగా పోస్టు చేయండి. అయినప్పటికి కూడా మీరు పోయిన నెలలో కాని అటు పోయిన నెలలో కాని కరెక్టు జవాబులు వ్రాసి ఉంటే వెంటనే ఎస్.యం.ఎస్ ద్వారా మీ అడ్రసు తెలియజేయండి. జనవరిలో మీకు బహుమానాలు పంపగలము. మిమ్ములను నిరాశ పరచుట మాకు ఇష్టము లేదు కనుక ఈ అవకాశము కల్పించుచున్నాము.

ఈ నెలలో “వేదాలలో క్రీస్తు” అనే క్రొత్త శీర్షికను మొదలు పెడుతున్నాము. ఇది మీ విశ్వాస జీవితానికి ఎంతో సహకరిస్తుందని నమ్మిక.

ఇకపోతే, దయచేసి ప్రపంచ శాంతి కొరకు ప్రార్థించండి. ప్రపంచమంతా అల్లకల్లోలమైపోతుంది. దేవుని రాకడ సూచనలు కనిపిస్తూనే ఉన్నాయి. మనుష్యులలో రాక్షసత్వం పెరిగిపోతుంది. ప్రకృతి కూడా విలయతాండవం చేస్తుంది. ఇక సమయము లేదు, దేవుని రాకడ అతి సమీపముగా ఉన్నది. రక్షణ కొరకు సిద్ధపాటు కలిగి ఉండండి.

మనలను రక్షించుటకు, మనకు శాంతి సమాధానాలు అనుగ్రహించుటకు రక్షకుడు పుట్టియున్నాడు.

మీ అందరికి

**క్రిస్మస్** మరియు **నూతన సంవత్సర శుభాకాంక్షలు**

-ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు



**– కొడవటికంటి**

ప్రార్థన తనకు చిన్నతనం నుండి తెలిసిన ప్రక్రియ. దేవునితో మాట్లాడటం, ఆయనను స్తుతించటం ప్రార్థన. ఇంతకు ముందు ఆయనను తను ఏమీ కోరలేదు. తన కోరిక ఏదో ఆయనకు తెలుసు. అది 'ఆయన కొరకు జీవించటమే!'

ఈ రోజు తన ప్రార్థన – తెలియక అవిశ్వాసమువలన చేసిన ప్రతి కార్యమును క్షమించమని అడగటమే! తను యాచింపక పోయినా తనకు తానై – తన మీద కృపచూపిన కరుణమూర్తికి కృతజ్ఞతలు వ్యక్తం చేయటం. ఈ లోకంలో ఇక ఏది తన చూపుకు తెలియకుండా, తనను తను తెలుసుకొనేంత వరకు, చూపులేని వానిగా చేసినందుకు – ఈ ప్రార్థనలు ఎన్నిరోజులు గడచిపోయినవో? కాని ప్రార్థించుట మానలేదు.

"సౌలా! సహోదరుడా! 'అననీయ' అనే దైవజనుడు నీ నిమిత్తము వచ్చి ఉన్నాడు" అని యూదా అంటుంటే, అననీయ అనే మనుష్యుడు లోనికి వచ్చి, తన తలమీద చేతులుంచటం సౌలు దర్శనంలో చూసాడు.

ప్రభువు అననీయ అనబడు వ్యక్తిని, ఆయన శిష్యుణ్ణి, తన కోసం పంపిస్తాడని – సౌలు ఆలోచించు కొంటున్నాడు. తరువాత అననీయ వచ్చి తల మీద చేతులుంచి, "సౌలా! సహోదరుడా! నీవు వచ్చిన మార్గములో నీకు కనబడిన ప్రభువైన యేసు – నీవు దృష్టిపొంది, పరిశుద్ధాత్మతో నింపబడు నట్లు నన్ను పంపియున్నాడు" అని అంటున్నప్పుడు తన కన్నుల నుండి పొరల వంటివి రాలటం తను చూశాడు. తల పైకెత్తి చూచినప్పుడు, అననీయ ముఖం దేవుని ప్రేమతో వెలుగుతున్నట్లుగా కనిపించింది.

తననుకానీ – ప్రభువైన యేసు మార్గంలో సంధింపక పోయినట్లయితే ఈ శిష్యుని కూడ హింసించి ఉండేవాడిని కదా! అనుకున్నాడు. ఇంతకు ముందు ఎంతమంది ఇటువంటి దయగలవారిని హింసించినది, – దేవుని పేరిట తను అవివేకిగాను, దూషకునిగాను, వంచకుడిగాను, హానికరుడుగాను, ప్రవర్తించినది తలచుకొంటే – ప్రభువైన యేసు తనకు ప్రత్యక్షమగుట 'దేవుని సంకల్పం!'.

మూడు రోజుల తర్వాత మరలా చూపు వచ్చినపుడు ఇప్పుడు తను చూస్తున్నవన్నీ – ఈ మనుష్యులు, భూమి, పశువులు, ఇండ్లు అన్నీ ప్రేమతో నిండి ఉన్నట్లుగా అనిపించాయి. ఇంతకు ముందు దైవకార్యములన్ని తను చేసినవన్నీ – కేవలం – వెర్రిపనులుగానే తోచాయి.

తర్వాత అననీయగారు, మరికొందరు శిష్యులు వచ్చి తనకు యేసు నామమున బాప్తీస్మము ఇచ్చారు. యేసు ప్రభువుని గూర్చి అనేక సంగతులు చెప్పారు. ఆయన ఈ లోకంలో ఉండినప్పుడు చేసిన సేవ గురించి చేప్పారు. చాలామంది ఆయన ఆరోహణమైనప్పుడు చూచిన వారు కూడా ఉన్నారు.

యొర్దానులో యేసు బాప్తిస్మము స్వీకరించిన వెంటనే ఆత్మవలన ఆరణ్యములోకి నెట్టుకొని పోబడిన తర్వాత నలభైరోజులు ఆయన ఎక్కడ ఉన్నది? ఏమైనది ఎవరికి తెలియదని ఆయన శిష్యులు మాట్లాడుకొంటుంటే సౌలు విన్నాడు.

దేవుని సేవలోకి ప్రవేశించుటకు ముందు నజరేయుడైన యేసు నలభైరోజులు ఆరణ్యములో ఏమి చేస్తుండి ఉండ వచ్చును? సౌలు ఈ విషయమే తీవ్రంగా యోచించుటకు మొదలుపెట్టాడు. ఆ తర్వాత రోజు నుండి సౌలు దమస్కులో, కాని మరి ఎక్కడైనా ఎవరికి కనిపించలేదు. కొద్దిరోజులు సౌలు కోసం ఎదురు చూసారు. కాని క్రమేపి ఆయన విషయం మనుష్యులు ఆలోచించుట మానివేసారు. తర్వాత మరచి పోయారు.

సౌలు చూపు పొందిన తర్వాత కొంతకాలం దమస్కులోని ప్రభువు శిష్యులతో సహవాసం కలిగి ఉండినా, అతని మనసుకు విశ్రాంతి దొరకలేదు. యేసును చూడక ముందు ఆయన మీద ఎంతద్వేషం ఉండినదో – ఆయన ప్రత్యక్షమైన తర్వాత – అంతకు అంత ప్రేమగా మారింది. ఆ ప్రేమ రోజురోజుకు ప్రవర్ధమానమై ఆయనను మరింత ఎరుగుటకు

ప్రయాస పడింది. ఇక్కడి శిష్యులుగాని, మరి ఎక్కడి శిష్యులు అయినా యేసును ఎరుగుదుమని అనుకొంటున్నారు. కాని వారు ఆయనను ఎరుగరు అనిపించింది. యేసును యూదా మతంలో నుండి చూసేవారికి నిజమైన యేసు కనబడలేదు. అందరి నుండి దూరంగా వెళ్ళి ఒంటరిగా యేసుతో గడపా లన్న కోరిక. ప్రయాణం – ముగింపు, అరేబియా – ఇదే సినాయి కొండ. యుగములలోను, తరములలోను, మరుగుచేయబడి ఉన్న మర్మము. అనగా – దేవుని మర్మమై ఉన్న క్రీస్తును ఎరిగియుండుట.....

మూడు సంవత్సరాల తర్వాత దమస్కు వచ్చేటప్పటికి సర్వాంగ కవచము ధరించిన యోధునివలె ఉన్నాడు. ఇప్పుడు తను ఎదుర్కొన బోయేది, తీవ్రమైన పోరాటము జరిపేది అన్యజనులతో కాదు. సాతానుతో కాదు. మొదట యూదా మత ప్రవిష్టులతో, తర్వాత యూదామతాన్ని ప్రేమించే యేసు శిష్యులతో. అయినా సరే! ప్రభువైన యేసు స్వయంగా అందించిన సువార్తకు తనేమి జోడించలేదు, లేక తీసివేసే ధైర్యము లేదు. ఇంతకు ముందు దేవునిసేవ తన చదువుతో, తన స్వతఃసిద్ధమైన అర్హతతో. తన నీతిలో అవన్నీ మూడు సంవత్సరాల క్రితం దమస్కు సమీపంలో నిస్సత్తువైనవిగా కనిపించనవి. తన జ్ఞానమునంతా దేవుడు వెర్రితనముగా చూపించినాడు. దమస్కులో అననీయ మరి ఎక్కువ ప్రేమతో ఆదరించాడు. ప్రభువుతో ఆయనకున్న సన్నిహితము, ఆ స్థితి – తను అందుకోవటానికే కాదు, అర్ధం చేసుకోవటానికైనా కొన్ని సంవత్సరాలు పడుతుందేమో! అనిపించింది.

అంతిపా హేరోదు తన తమ్ముని భార్యయైన హేరోది యాను వివాహమాడుటకు గాను, అరేబీయా రాజైన, 'అరిటాస్' కుమార్తెయైన తోరా అనే తన భార్యను విడనాడినాడు. అందువలన అరిటాస్, అంతిపా హెరోదు మీద దండెత్తి వచ్చాడు. హేరోదు ఆనాటి రోమా చక్రవర్తియైన తిబెరియ సహాయం కోరాడు. తిబెరియ సీజరు, అందుకు సమ్మతించి తన సైనికాధికారులలో ఒకడైన 'వితెల్లియా' ను సైన్యముతో పంపించాడు. అరిటాస్‌ను ప్రాణంతో కాని, మరణించినాకాని, రోమా పట్టణం తీసుకొని రావలసిందిగా ఆజ్ఞాపించాడు. ఏ కారణం వల్లనైతేనేమి 'వితెల్లియా' – అరిటాస్ మీద దండయాత్ర కొంత ఆలస్యం చేసాడు. ఈలోపు తిబెరియ చక్రవర్తి చనిపోయినందువల్ల అరేబియ రాజు – అరిటాస్ తెప్పరిల్లగలిగాడు. దమస్కు పట్టణాన్ని కూడ జయించిన అరిటాస్, తన సైన్యాధిపతులలో ఒకనిని దమస్కుకు అధిపతిగా నియమించాడు.

సౌలు అరేబియా (సినాయి) నుండి తిరిగి వచ్చి 'ప్రభువైన యేసే – క్రీస్తు' అని ప్రకటించుట ప్రారంభించినప్పుడు యూదులు విభ్రాంతి నొందారు. ఏ నిర్ణయం తీసుకోవడానికి అధికారంలేని యూదులు, సమాజ మందిరపు సభ్యులు, సన్‌హెద్రిన్ సభవారికి 'సౌలు ఇంతకు ముందు యూదులలో ఏ సిద్ధాంతమునైతే వ్యతిరేకించి, దాన్ని అవలంభించిన వారిని చెరసాలలో వేయించాడో, అదే సిద్ధాంతాన్ని ప్రచురిస్తున్నాడ'ని వర్తమానం పంపించారు. అందుకు సన్‌హెద్రిన్ సభ వారు ఈ విషయాన్ని బహిరంగం చేయకుండా జాగ్రత్తపడి, దమస్కు పరిపాలకునికి 'సౌలు – హేరోదు అంతిపా మనిషి' అని వర్తమానము పంపించాడు. అందువలన దమస్కు పట్టణపు వాకిండ్లు అన్న గూఢచారులచే కప్పబడి, సౌలు కోసమై అన్వేషణ జరిగింది.

**(సశేషం)**



# నా స్వప్నము



## (లియో టాల్‌స్టాయ్)

**"ఆమె కుమార్తెగా ఇంకెన్నడును మనుగడలో లేదు.** అర్థమైందా? ఆమె ఇక లేదు. అయినను ఆమె ఇతరుల దయాదాక్షిణ్యాలతో బ్రతకటానికి కుదరదు. అందువలన ఆమె తన కిష్టమైన రీతిలో బ్రతకగలగాలి. కాని ఆమెను గురించి నేను ఆలోచించలేను. ఆమె ఇప్పుడున్న భయంకర స్థితిని ఊహించలేను... ఊహించలేను..." అని కండ్లు పైకెత్తి తన కంటె పది సంవత్సరాలు పెద్దవాడైన తన సోదరుడు ప్రిన్సు పీటర్‌తో అన్నాడు.

ప్రిన్సు పీటరు రష్యాలోని ఒక ప్రాంతానికి గవర్నరుగా ఉన్నాడు. ఈ మాటలు ప్రిన్సు మైకెల్ ఇవానోవిచ్. మైకెల్ కుమార్తె ఒక సంవత్సరం క్రితం ఇల్లు వదిలి వెళ్ళిపోయి ప్రస్తుతం ఈ పట్టణంలోనే జీవిస్తున్నదని తెలుసుకున్నప్పుడు అతని హృదయం పగిలిపోయింది. సెయింట్ పీటర్ బర్గ్ నుండి వచ్చిన తన పెద్ద అన్నతో ఇప్పుడు మాట్లాడుతున్నాడు.

ప్రిన్సు మైకెల్ పొడవుగా చక్కగా ఆహంభావిగా ఆకర్షణీయముగా కనబడతాడు. అతని భార్య ఎప్పుడు చిర్రుబుర్రులాడుతూ అతనితో చిన్నదానికి పెద్దదానికి తగువులాడుతూ ఇంట్లో ఎవరిని నెమ్మదిగా ఉండనివ్వదు. ఒక కుమారుడు ఉన్నాడు. అతను చేతినిండా డబ్బు తీసుకొని వెళ్ళి జులాయిగా తిరుగుతూ డబ్బు ఖర్చు పెడుతుంటాడు. ఇద్దరు కుమార్తెలలో, పెద్దది చక్కగా పెండ్లి చేసుకొని భర్తతో జీవిస్తున్నది. చిన్న కుమార్తె 'లీసా' అంటే తనకెంతో ఇష్టం, ప్రేమ. కాని ఆమె సంవత్సరం క్రితం ఎటో వెళ్ళిపోయి ఓ బిడ్డతో తిరిగివచ్చి ఈ పట్టణంలోనే జీవిస్తున్నదని విన్నాడు.

లీసా అసలు ఎందుకు ఇల్లు వదిలి వెళ్ళింది? ఆమె బిడ్డకు తండ్రి ఎవరు? అని తన అన్న పీటర్‌ని అడగాలను కున్నాడు. కాని అడుగలేదు.

పీటర్ భార్య తన మరిదిని పరామర్శించాలనుకున్నది. కాని అతని కండ్లలో కనిపించే వ్యధను చూసి మౌనంగా ఉండిపోయింది. మధ్యాహ్నం భోజనాలకు కూర్చున్నప్పుడు మైకెల్ ఏమి జరగనట్లుగా స్నేహితులతో బంధువులతో ఉల్లాసంగా కనిపించాడు.

ఆ సాయంకాలము తోట దగ్గర కొంచెంసేపు ఆడుకొని తన గదిలోకి వచ్చి ఇక విశ్రాంతిగా ఉండాలనుకోబో తుండగా తలుపుమీద ఎవరో చిన్నగా తట్టారు. "ఎవరది?" అన్నాడు.

"నీ వదినని, మైకెల్!" అన్నది.

మైకెల్ లేచి నిలుచుని "రండి!" అన్నాడు. అతని వదిన – ఆమె చక్కనిదే కాని తల వెంట్రుకలు సరియైన పద్ధతిలో ఉంచుకోదు. ఆమె ఎప్పుడు అన్యమనస్కురాలై ఉంటుంది. ఆమె మాట్లాడే మాటలు ఎన్నడు అప్పటి పరిస్థితులకు అనువుగా ఉండవు.

ఆమె కొరకు కుర్చీ వేస్తూ ఆమె వైపు చూచాడు.

"నేను నీకు విసుకు కలిగించను మైకెల్! రెండు మాటలు లీసా గురించి చెబుతాను" అన్నది.

''సరే! మీరేది మాట్లాడినా ఒకే ఒక్కనిమిషం మాట్లాడండి" అన్నాడు, ఆమె వైపు చూడకుండా.

"మైకెల్! లీసా మీద దయ ఉంచు, ఆమె కూడా మానవ మాత్రురాలే కదా! ఆమె నీ కుమార్తె" అన్నది.

"ఆ మాట నిజమే! ఆమె నాకెంతో ప్రియమైనది. ఇప్పుడు ఆ సంగతి ఎందుకు?" అన్నాడు.

"మైకెల్! ఆ అమ్మాయిని ఒకసారి పలకరించు. అసలు తప్పంతా..."

వెంటనే జేవురించిన ముఖంతో "దయచేసి ఇక ఆపండి. ఇప్పటికే నేను చాలా కృంగిపోయి ఉన్నాను. ఇకముందు ఆమె ఎవ్వరి సహాయము లేకుండా నాతో ఇకముందు ఎటువంటి సంబంధం లేకుండా జీవించగలిగిన డబ్బు ఆమెకిస్తాను. అంతే!" అన్నాడు కోపంగా.

"నీ భార్య కూడా నీలాగే ఆలోచిస్తున్నది" అన్నది దీనంగా.

"అంతే! అంతే!" అన్నాడు.

ఆమె మౌనంగా కొంచెంసేపు నిలుచున్నది. "నీవు ఇచ్చే డబ్బు అమ్మాయి నివశిస్తున్న ఇంటి యజమానురాలికి ఇవ్వవద్దు. నీ దగ్గర అడ్రసు ఉన్నదా?" అన్నది.

"ఉన్నది" అన్నాడు.

"అయితే నీవే వెళ్ళు. ఆమె... దగ్గర ఇప్పుడు ఎవ్వరు లేరు. ఆమె పరిస్థితి చూడు" అన్నది.

"నన్నెందుకు ఇలా హింసిస్తున్నావు?" అన్నాడు మైకెల్.

ఆమె కన్నీళ్ళు పెట్టుకొని "ఆమె బహు దీనస్థితిలో ఉన్నది" అన్నది.

ఆమె లేచి నిలుచుని మైకెల్‌ని చూస్తూ "నువ్వు తప్పు చేస్తున్నావు" అని వెళ్ళిపోయింది.

ఆమె అలా వెళ్ళంగానే మైకెల్ తన గదిలోనే అటు ఇటు తిరుగుతూ హ్హా... హ్హా అన్నాడు వేదనతో. తన స్వరము తనకే భయం పుట్టించింది. కొంచెంసేపటికి అతని అహంకారము మరలా అతనిలోకి వచ్చింది. అటు ఇటు నడుస్తూ "లీసా!" అన్నాడు. పుట్టిననాటినుండి ఆ అమ్మాయిని ఎంతో ప్రేమగా చూచాడు. ఎంతో ముద్దుగా పెంచాడు. అడిగినవన్ని ఇచ్చాడు. ఆమెను బాగా చదివించాడు. భవిష్యత్తులో వివాహమై విదేశాలలో స్థిరపడుతుంది అనుకున్నాడు. ఈ దేశములో తన ఉనికికి ఒక ప్రత్యేకత ఉన్నది. అది ఈ కుమార్తె ద్వారా ఇంకా ఎదుగుతుంది అనుకున్నాడు. ఎనిమిది సంవత్సరాల వయస్సులో చక్కని కండ్లు, చక్కని తలవెంట్రుకలతో తన గదిలో ఆడుకునేది. తను కూర్చున్నప్పుడు తన మోకాళ్ళమీదకు ఎక్కి మెడమీద చేతులు వేసి లాగేది. ముఖంలో చూసి నవ్వేది. పెదాలమీద ముద్దుపెట్టేది. చక్కలిగింతలు పెట్టేది.

ఆమె ఎదిగిన తర్వాత ఆడమనిషిగా మారిన తర్వాత ఎవరైనా ఆమెను యువతిగా చూస్తే భయమేసేది. కోపం వచ్చేది. యువకులు ఆమె వైపు ఆశగా చూడడం తనకు ఇష్టం ఉండేది కాదు. ఆమె డ్యాన్సు కొరకు డ్రస్ వేసుకుంటే ప్రజలు ఆమెను చక్కనిదని అన్నప్పుడు లీసా సంతోషపడితే 'అవును చక్కనిదే నా కుమార్తె' అనుకున్నాడు. ఆమె వివాహము కొరకు రెండు గొప్ప సంబంధాలు వస్తే ఆమె తిరస్కరించింది. అలా రెండు మూడు సంవత్సరాలు దొర్లిపోయిన తర్వాత ఆమెకు వెంటనే వివాహం చెయ్యాలన్న ఆలోచన తనలో బలంగా నాటుకున్నది. తర్వాత మరియొక గొప్ప సంబంధం వస్తే వారిముందు అవమానకరంగా ప్రవర్తించింది. అప్పుడు తనకు చాలా కోపం వచ్చింది. ఈవిధంగా వచ్చిన సంబంధాలన్నిటిని తిరస్కరించడం నేటి ఈ దుస్థితి కొరకే అని మైకెల్ హృదయం మండిపడింది.

మంచం మీద కూర్చుని ఆలోచించడం మొదలుపెడితే తన కోపం పెరుగుతున్నది. మరలా జ్ఞాపకాలు రాసాగాయి. అమ్మాయిని ఇరవై సంవత్సరాల వయస్సులో తన ఇంట్లో నివశించే పద్నాలుగు సంవత్సరాల యువకునితో సరసమాడడం గమనించి వానిని వెళ్ళగొట్టాడు. అప్పుడు లీసా తనను తండ్రి – అన్న గౌరవం లేకుండా అసభ్యంగా మాట్లాడింది. నాటినుండి తండ్రి కుమార్తెల ప్రేమ ద్వేషంగా మారింది.

"ఔను! నేను సరిగానే ప్రవర్తించాను. లీసా సిగ్గు మాలిన పిల్ల" అని తనలో తానే అనుకొన్నట్లుగా గొణిగాడు.

తర్వాత మాస్కో నుండి ఓ ఉత్తరం వ్రాసింది. తను ఇక ఇంటికి రానని, నన్ను క్షమించి మరిచిపోండి అని వ్రాసింది. తర్వాత తన భార్యతో మాట్లాడినప్పుడు లీసా తన మేనత్తను చూడబోయినప్పుడు ఒక స్వీడన్ వ్యక్తిని, ఒక దగుల్బాచిని పెండ్లి చేసుకున్నట్లుగా తెలిసింది.

గత విషయాలన్నీ తన మెదడులోనికి వచ్చినపుడు ఆమె తన హృదయాన్ని వేదనకు గురిచేసిన విషయాలన్ని గుర్తుకు వచ్చినపుడు హృదయం దద్దరిల్లిపోయింది. ఆమెను ద్వేషించసాగాడు. తన వదినతో కొంచెంసేపటి క్రితం మాట్లాడిన విషయంలో తను తన కుమార్తెను ఎలా క్షమించగలడు? తన వ్యక్తిత్వాన్నే అధోగతిపాలు చేసింది. లేచి ఒక సిగిరెట్టు ముట్టించి అటు ఇటు పచార్లు చెయ్యసాగాడు. 'ఇకను ఆలోచించడం అనవసరం. ఆమెకు ప్రతి నెలా ఇవ్వమని కొంత డబ్బును మా అన్నకి ఇస్తాను. నామట్టుకైతే నాకు ఏ సంభంధం ఉండదు' అనుకున్నాడు. మరల అతనిలో లీసామీద ఎనలేని ప్రేమ ప్రవేశించింది. వెంటనే ఆమె తనను అవమానించిన విధము తనలోని ప్రేమను ఆర్పివేసింది.

**(సశేషం)**

# క్రిస్ మస్
## (వాస్తవ గాథ)

ఐర్లాండు దేశంలోని ఒక పెద్ద పట్టణములో పుల్ పుల్వోన్ కృశ్చవ్ అనే ఒక గొప్ప ధనవంతుడు ఉండేవాడు. అతనికి అన్నీ సౌకర్యాలు ఉన్నాయి కానీ సంతానము లేదు. అందుకని ఆ భార్యాభర్తలు ఎప్పుడూ దుఃఖంతో జీవిస్తూ ఉండేవారు. సంతానము కొరకు వారు చేయని పూజలు, వ్రతాలు లేవు. ఎట్టకేలకు ఒక ఫాదరు వారి గృహాన్ని దర్శించి ప్రార్థనలు జరిపించి మీరు ఈ విధంగా జీవించినట్లయితే దేవుడు సంతోషించి మీ కోరిక తీరుస్తాడు అని చెప్పాడు. వారు ఆ విధంగానే ఎంతో భక్తిశ్రద్ధలతో ఆయన చెప్పిన విధంగా చేయటం వలన దేవుడు సంతోషించి వారికి చక్కని మగ సంతానాన్ని ప్రసాదించాడు. ఇక వారి సంతోషానికి పట్టపగ్గాలు లేవు. పిల్లవాడే వారి సర్వ స్వము. ఎప్పుడూ ఆ బాబుని గురించే వారి ధ్యాసంతా. అన్నీ ఆ బాబు కొరకే చేసేవారు. ఆ బాబు పేరట ఒక పెద్ద ఇల్లు, మంచి గుఱ్ఱపు బగ్గీ (అప్పుడు ధనవంతులు గుఱ్ఱపు బండ్ల మీదే ప్రయాణం), మంచి మంచి జాతి గుఱ్ఱాలు ఆ విధంగా ఎన్నో పిచ్చిపిచ్చిగా చేసేవారు.



బాబు మొదటి జన్మదినము వచ్చింది. ఆ వేడుక ఆడంబరంగా జరిపించాలని నిశ్చయించి ఎంతోమంది ధనవంతులైన తమ బంధువులను, వ్యాపారస్థులను, నగర పాలకులను ఆహ్వానించి గొప్ప విందు కార్యక్రమము ఏర్పాటు చేశారు. ఇంటి నిండా పనివారే. ఆ రోజు చాలా హడావిడిగా వుంది. మంచి ఖరీదైన వంటకాలు చేయటంలో కొందరు, అతిథులను ఆహ్వానించడంలో కొందరు, ఇంటి అలంకరణలో కొందరు మునిగిపోయి వున్నారు.

సాయంత్రం 5 గంటలకే చీకటి పడిపోతుంది. అతిథులు ఒక్కొక్కరే రాసాగారు. అందరూ ఖరీదైన దుస్తులతో గొప్ప గొప్ప ఖరీదైన గుఱ్ఱాలని కలిగిన బగ్గీలలో రాసాగారు. అది మిక్కిలి మంచు కురిసే కాలము కాబట్టి అందరూ ఖరీదైన లాంగ్‌కోట్స్, తమ విలువైన వస్త్రాల మీద ధరించి వస్తున్నారు. లాంగ్‌కోట్స్ చాలా బరువుగా కూడా ఉంటాయి. ఇవి తగిలించుకోడానికి ఒక గది, స్టాండ్సు ఉంటాయి.

బాబు తల్లి బంధువులు చాలామంది రావటం వలన వారికి వసతులు చూడటానికని బాబు కొరకు ప్రత్యేకంగా నియమించిన ఆయాకి బాబుని అప్పగించి బంధువులను సంతోష పరచడంలో మునిగి పోయింది. తండ్రి గొప్ప గొప్ప అతిథులతో తమ గొప్పలు చెప్తూ కుంటూ సమయం గడుపుతూ ఉన్నాడు. రాత్రి 10 గంట లకు డ్యాన్సు కార్య క్రమము, గొప్ప గొప్ప వారి విందు లలో ఉండే ప్రత్యేకమైన త్రాగుడు కార్యక్రమము, చిందుల కార్యక్రమము మొద లయ్యింది. ఆడువారు మగ వారు కలసి నాట్యం చేయటం వారి సాంప్రదాయము. కృశ్చవ్, అతని భార్య అతిథులతో కలిసి నాట్యము చేస్తూ త్రాగుతూ సంతోషిస్తున్నారు.

ఇక్కడ బాబు కొరకు నియమించబడిన ఆయా 22 సంవత్సరాల యవ్వనస్తురాలు. (అక్కడ ఆయాలుగా యవ్వనస్తులనే నియమిస్తారు). ఆమె ప్రియుడు ఆ సమయానికే అక్కడికి వచ్చి ఆమెని పిలిచాడు. బాబు నిద్రపోతున్నాడు. మరలా వెంటనే వచ్చేయొచ్చని బాబుని అక్కడే వున్న ఒక ఉయ్యాల లాంటి బాక్సులో చక్కగా పరుపు

అమర్చి గోడ ప్రక్కగా పెట్టి వెళ్ళిపోయింది. అయితే సంగతేమిటంటే, ఆ ఉయ్యాలలాంటి బాక్సు ఉన్న పైగా ఈ లాంగ్‌కోట్స్ తగిలించుకునే స్టాండు ఉంది. ధనవంతుని ఇంట విందు కాబట్టి అతిధులు ఎక్కువగా వస్తున్నారు. అందరికీ లాంగ్‌కోట్స్ ఉన్నందున వారు వాటిని అక్కడే ఉన్న స్టాండుకి తగిలిస్తున్నారు.

అందులో ఒక కోటు జారి బాబు వున్న ఉయ్యాల మీద పడి బాబును కప్పి వేసింది. తరువాత వచ్చే వారు అది బాబు ఉన్న ఉయ్యాల అని గ్రహించక తగిలించు కోవడానికి స్థలము లేక ఒకరి తర్వాత ఒకరు ఆ బాబు ఉన్న ఉయ్యాల మీదనే వేసి చక్కా విందు, నాట్యాలకి వెళ్ళి పోయారు.



అందరూ ఇలా ఉండగా 12 గంటలు అయ్యింది. బాబు పుట్టిన రోజు ప్రవేశించింది. కేక్ కట్ చేయాలి. అందరూ కలసి బాబుకి గ్రీటింగ్స్ చెప్పాలి. కనుక తల్లి వెంటనే ఆయా కొరకు వెదకింది. అయితే ఆయా బాబు సంగతి మరచి తన ప్రియుడితో హోటల్‌లో ఉండిపోయింది.

ఇక్కడ అందరు ఆయా కోసం వెదుకు తున్నారు. తలా ఒక విధంగా మాట్లాడు తున్నారు. తల్లికి పట్టలేని దుఃఖము వచ్చేసింది. పెద్దగా ఏడ్వటం మొదలు పెట్టింది. ఇంటా బయటా అంతా వెదికారు. కానీ ఎక్కడా బాబు జాడకానీ, ఆయా జాడకానీ కనబడలేదు. కొందరు పోలీస్ రిపోర్టు ఇవ్వడానికి పరిగెత్తారు. కొందరు ఆయా ఇంటికి పరు గెత్తారు. అయినా జాడలేదు.

12 గంటల నుండి 3 గంటల వరకు దేవులాట కార్యక్రమము జరిగంది. ఇక తల్లిదండ్రుల గోడు చూడలేక వచ్చిన బంధువులంతా ఒక్కొక్కరే జారుకోవడం మొదలు పెట్టారు. పోయేటప్పుడు తమ తమ లాంగ్‌కోట్స్ తీసుకొని వెళ్తున్నారు. ఉన్నట్టుండి పెద్ద కేక "ఇదుగో బాబు" అని. అందరూ ఉలిక్కిపడ్డారు. ఎక్కడ ఎక్కడ అంటూ పరుగెత్తు కుంటూ వచ్చారు. తల్లి గభాలున బిడ్డని ఎత్తికొని ముద్దులు పెట్టటం మొదలు పెట్టింది. అయితే వెంటనే పెద్దగా అరిచింది. ఆ బాబు అచేతనంగా ఉన్నాడు. ఈ లాంగ్‌కోట్స్ అతని మీద పడటం వలన ఊపిరి ఆడక ఆ బాబు ఎప్పుడో చనిపోయాడు. ఇక తరువాత పరిస్థితి వ్రాసి మిమ్ములను దుఃఖ పెట్టడం నాకిష్టం లేదు. తల్లి దండ్రులు, బంధువులు గుండెలు అవిసేలాగున ఎంత రోదించారో మనం ఊహించగలం.

ఇది క్రిస్మస్ వేడుకకు మంచి నిదర్శనం. ఆ బిడ్డ జన్మదినమున బిడ్డను నిర్లక్ష్యము చేసి వారి విందు వినోదాలలో మునిగిపోయరు. బిడ్డకు ఆనందము కలిగించే పనులు తల్లి దండ్రులు బిడ్డను ఎత్తుకొని బంధు వులకు, మిత్రులకు చూపించి దేవుడు తమను ప్రేమించి ఇచ్చిన బిడ్డ అని అందరికీ సాక్ష్యం చెప్పటం మరచి తమ సంతోషా లలో మునిగిపోయి బిడ్డను పోగొట్టుకున్నారు.

ఆలోచించండి. మనము చేసే ఈ క్రిస్మస్ పండుగ అలా ఉందేమో. క్రీస్తుకు ప్రాముఖ్యత ఇవ్వకుండా క్రీస్తుని సంతోషపరచ కుండా క్రీస్తులేని క్రిస్మస్ పండు గను చేసి దేవుని దుః ఖ పెడుతున్నామేమో ఆలోచించండి. క్రీస్తుతో క్రిస్మస్ చేసి దీవెనలు పొందుదాము.

## Let us Celebrate Christmas with Jesus



చిన్నపిల్లల పేజి

# కుమారుని ఎవరు తీసుకుంటారు?

ధనవంతుడైన ఒక అతను అతని కొడుకు ఎప్పుడు అందమైన పేంటింగ్స్ కొని దాచుకొవటం అంటే చాలా ఇష్టం. వాళ్ళు దాదాపు అందరు గొప్ప గొప్ప ఆర్టిస్ట్స్ గీసిన బొమ్మలన్ని దాచుకున్నారు.

వాళ్ళు ఆ పేయింటింగ్స్ కొనటమే కాకుండా దాన్ని ముందు పెట్టుకొని దాని గురించి మాట్లాడుకుంటారు కూడా. అలాగైతే ఒక రోజు అతని కొడుకు ఒక యుద్ధానికి వెళ్ళాల్సి వచ్చింది. అతను చాలా ధైర్యవంతుడు. అతను ఆ యుద్ధంలో ఒక సైనికుని కాపాడేటప్పుడు చనిపోయాడు. ఈ విషయం వాళ్ళ నాన్నకి తెలిసింది. తన కొడుకు గురించి చాలా బాధ పడ్డాడు




తరువాత క్రిస్మస్‌కి ఒక నెలముందు ఎవరో తలుపు కొట్టినట్టు వినిపించింది. ఆ ధనవంతుడైన అతను వెంటనే వెళ్ళి చూస్తే అతని కొడుకు వయస్సు ఉన్న ఒకతను చేతిలో పెద్ద పెయింటింగ్ పట్టుకొని ఉన్నాడు. ఆ అబ్బాయి అతనితో అయ్యా నేను మీకు తెలియదు నేను మీ అబ్బాయి కాపాడిన సైనికుడిని. మీ అబ్బాయి ఆ రోజు నా ప్రాణంమే కాదు చాలా మంది ప్రాణాలు కాపాడాడు. అతని శరీరంలో ఒక బులెట్ పోయింది. అతను అక్కడి కక్కడే చనిపోయాడు. అతను నాకు చాలా సార్లు చెప్పాడు మీ గురించి మీకు పెయింటింగ్స్ అంటే చాలా ఇష్టమని.

ఆ అబ్బాయి ఆ చేతిలో ఉన్న ఆ వస్తువు తీసి క్రింద పెట్టి, నాకు తెలుసు ఇదేమి అంత ఎక్కువ కాదు. నేను అంత గొప్ప ఆర్టిస్ట్‌ని కాను. కాని మీ కొడుకు ఇది మీరు తీసుకోవాలని కోరుకుంటాడు అని చెప్పాడు. అతని తండ్రి అది తెరిచి చూశాడు. తన కుమారుని ముఖం వేసాడు ఆ అబ్బాయి. చాలా ఆశ్చర్యపోయాడు అతను. ఆయన ఎలా అతని కుమారుని ముఖం గీశాడా అని. అది చూసి చాలా చాలా ఏడ్చాడు. ఆయన కళ్ళ నుండి వచ్చే ఆ కన్నీటి ధార ఆగడంలేదు. నీకు చాలా ధన్యవాదములు బాబు, నేను ఈ పెయింటింగ్ కొరకు నీకు ఏదైన ఇవ్వాలని పిస్తుంది అన్నాడు ఆ పెయింటింగ్ తెచ్చిన అతనితో. నాకేమి వద్దయ్యా. మీ కొడుకు నాకు చేసిన దానికి నేను ఏమిచ్చినా తక్కువే. ఇది ఒక బహుమతి అనుకోండి అంతే అన్నాడు.

తండ్రి ఆ పెయింటింగ్‌ని ఆ భవనంలో తగిలించాడు. ఆయన అక్కడికి వచ్చిన వారందరికి ముందుగా ఆ పెయింటింగ్‌ని చూపించేవాడు. ఆ తరువాత ఆయన మిగిలిన పేంటింగ్స్‌ని చూపించేవాడు. కొన్ని రోజులకు అతను కూడా చనిపోయాడు. అప్పుడు అక్కడున్న ఒకతను చనిపోయిన ఆ పెద్దాయన వీలునామా ప్రకారం ఆ పెయింటింగ్స్ అన్నిటిని ఒక వేలంపాట పెట్టాలి అనుకున్నాడు. అలాగే ఒక వేలంపాట పెట్టాడు. చాలామంది గొప్ప గొప్పవాళ్ళు వచ్చారు. అతని కుమారుని పెయింటింగ్ కూడా వాటిలో ఉంది. ఆ వేలంపాట పెట్టే అతను 'ముందుగా ఈ పెయింటింగ్స్‌లో ఉన్న ఈ కుమారుని పెయింటింగ్‌తో వేలంపాట మొదలు పెడదాం. ముందు ఎవరు ఈ కుమారుని పెయింటింగ్ కొంటారు' అని అడిగాడు. అతను అలా చెప్పగానే అక్కడంతా నిశ్శబ్దంగా అయింది. అప్పుడు ఆ గదిలో వెనక నుంచి ఒక శబ్దం వచ్చింది 'అక్కడ ఎన్నో

గొప్ప గొప్ప పేంటింగ్స్ ఉన్నాయి కదా అది తీసి పక్క పెట్టు' అన్నారు ఎవరో. కాని ఆ వేలంపాట పెట్టినతను మాత్రం ముందు దీన్ని కొనండి తరువాత మిగిలినవి అని అన్నాడు. ఎవరు మొదలు పెడతారు. 10,000 లేక 20,000 నుండి మొదలు పెట్టండి అన్నాడు. ఇంకొకతను కోపంగా 'అది తీసేయి మేము అది చూడటానికి రాలేదు. పికాసా అంత గొప్ప వ్యక్తి వేసిన పేంటింగ్స్ చూపించు' అని అన్నాడు.

అయిన కూడా ఆ వేలంపాట అతను 'కుమారుడు! కుమారుడు! ఎవరు తీసుకుంటారు ఈ కుమారుని' అని అరుస్తున్నాడు.

చివరికి ఆ గది మూలనుండి ఒక శబ్ధం వచ్చింది. 'నేను తీసుకుంటాను కుమారుని పెయింటింగ్' అని. అతనెవరోకాదు ఆ ధనవంతుని అతని కుమారుని తోటమాలి. 'నేను దానికి 500 ఇస్తాను' అన్నాడు. 'సరే ఇంకెవరైన 1000 అంటారా? ఎవరు లేరా కొనేవారు. 500 ఒకటోసారి 500 రెండోసారి 500 మూడోసారి అన్నాడు.

ఆ గుంపులో ఉన్న ఒకతను 'పెయింటింగ్ పోయిందిగా మిగిలిన వేలంపాట మొదలు పెట్టు' అన్నాడు.

'ఇంక వేలంపాట అయిపోయింది వెళ్ళిపోండి' అన్నాడు అతను. 'అదేంటి ఇంకా చాలా ఉన్నాయి కదా దానికంటే మంచివి' అన్నాడు ఆ గుంపులో అతను. 'నన్ను క్షమించండి నా యజమాని చనిపోయే ముందు ఒక వీలునామా రాశారు. వేలంపాటలో నా కుమారుని పెయింటింగ్ ఎవరైతే ముందుగా తీసుకుంటారో వాళ్ళకి ఈ మిగిలిన పెయింటింగ్స్, అలాగే ఈ ధనవంతునికి సంబంధించిన ఆస్తులన్ని చెందుతాయని రాశాడు' ముందుగా తెలిస్తే ఎవరైన మాకు మాకు అని కుమారుని పెయింటింగ్ తీసుకోడానికి దూకుతారు. అందుకే ఈ విధంగా వేలంపాట వీలునామా ప్రకారం ఏమి చెప్పకుండా పెట్టాము. కాబట్టి వేలంపాటలో కుమారుని పెయింటింగ్ దక్కించుకున్న ఈ తోటమాలికే మిగిలిన పెయింటింగ్స్‌తో పాటు ధనవంతుని యొక్క ఆస్తిపాస్తులన్నీ చెందుతాయి. ఇంతటితో వేలంపాట ముగిసింది అని చెప్పాడు.

చూడండి అలాగే మన కోసం 2000 సంవత్సరాల క్రితం మన పాపముల కొరకు "యేసుప్రభువు" సిలువ వేయబడ్డాడు. ఆ వేళ్ళంపాట ఆయనలాగే ఇప్పుడు చాలామంది మిషనరీస్ మన కొరకు సువార్తను ప్రకటిస్తున్నారు. ఎవరు కుమారుని తీసుకుంటారని? చూసారుగా అలాగే కుమారుని ఎవరు అంగీకరిస్తారో వాళ్ళ దగ్గర అన్ని ఉంటాయి. అన్నిటికంటే గొప్పది ఆయన మనకు నిత్యజీవము ఇచ్చారు. నేనే మార్గం, సత్యం, జీవం. నా ద్వారానే తప్ప ఎవరు తండ్రి దగ్గరకు చేరలేరు. మీరే ఆలోచించండి ఎవరు కుమారుని వాళ్ళ జీవితంలోకి తీసుకుంటారు?

ఈ క్రిస్మస్ సందర్భంగానైనా మీరు క్రీస్తును మీ స్వంత రక్షకునిగా అంగీకరించి, క్రీస్తుని సంపాదించుకుంటే మీరు సమస్తము సంపాదించుకున్నట్లే. ప్రభువైన యేసు కృప ఇప్పుడు, ఎల్లప్పుడు సదాకాలము మీకు తోడైయుండు గాక!




**పాఠకులకు, చందాదారులకు,**


**ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు**

**క్రిస్మస్ మరియు**

**నూతన సంవత్సర శుభాకాంక్షలు!!**



**- ఎడిటర్ మరియు సిబ్బంది**



# బైబిలు చరిత్ర

**సేకరణ:** రెవ.డా॥ కె.జోసఫ్

**యిర్మీయా**-పరిచయం

యిర్మీయా ప్రవక్త క్రీస్తు పూర్వం ఏడవ శతాబ్దం ద్వితీయార్థంలోను ఆరవ శతాబ్దం ప్రథమార్థంలోను జీవించాడు. దేశంలో నానాటికీ అధికమౌతున్న విగ్రహారాధన పాపం వినాశనానికి నడిపిస్తుందని యిర్మీయా సుదీర్ఘ కాలంగా ప్రవచించాడు. అయినా యిర్మీయా మాటలను ఎవరూ లెక్కచేయలేదు. కాబట్టి అతను తన ప్రవచనాలు తన జీవితకాలంలోనే నెరవేరడం చూశాడు. బబులోను రాజైన నెబుకద్నెజరు యెరూషలేముపైకి దేవాలయంపైకి దాడి చేసి యూదా రాజును అతని ప్రజలను బబులోనుకు బందీలుగా పట్టుకుపోయాడు. యూదా ప్రజలు చెరనుండి తిరిగి వచ్చి దేశాన్ని పునరుద్ధరిస్తారని కూడా యిర్మీయా ప్రవచించాడు.

**విషయసూచిక**

దేవుడు యిర్మీయాను ప్రవక్తగా ఏర్పరచుకోవడం 1:1-19

యోషీయా యెహోయాకీము యెహోయాకీను సిద్కియా రాజుల పాలనలో యిర్మీయా ప్రవచనాలు 2:1-25:38

యిర్మీయా జీవితంలోని సంఘటనలు 26:1-45:5

దేశాల గురించి ప్రవచనాలు 46:1-51:64

యెరూషలేము పతనం 52:1-34

**విలాపవాక్యములు**-పరిచయం

క్రీస్తు పూర్వం 586 సంవత్సరంలో యెరూషలేము పతనం, వినాశనం, మరియు చెర అనంతరం ఏర్పడిన దుర్గతినిబట్టి విలపిస్తూ ఆలపించిన అయిదు పద్యాల సంకలనం విలాపవాక్యములు గ్రంథం. ఈ గ్రంథంలో విలాపగీతాల మధ్య దేవునిలో నమ్మకం భవితవ్యంపట్ల ఆశాభావం కనిపించడం విశేషాంశం. యూదులు తమ దేశపతనాన్ని స్మరణకు తెచ్చుకుంటూ ఆచరించే ఉపవాస దినాల్లో ఈ విలాపగీతాలను ఆలపించడం పరిపాటి.

**విషయసూచిక**

యెరూషలేము దుర్గతి 1:1-22

యెరూషలేముపైకి వచ్చిన శిక్ష 2:1-22

శిక్ష, మరియు నిరీక్షణ 3:1-66

శిథిలమైన యెరూషలేము 4:1-22

కృపకొరకు వేడుకొనడం 5:1-22

**యెహెజ్కేలు**-పరిచయం

క్రీస్తు పూర్వం 586 సంవత్సరంలో యెరూషలేము పతనమైన తర్వాత యెహెజ్కేలు ప్రవక్త బబులోను చెరలో జీవించాడు. బబులోను చెరలో ఉన్న ప్రజల నుద్దేశించి, మరియు యెరూషలేములో ఉన్న శేషప్రజ నుద్దేశించి యెహెజ్కేలు ప్రవచించాడు. దర్శనాలు సాదృశ్యాలు ప్రాముఖ్యంగా కనిపించే ఈ గ్రంథంలో యెహెజ్కేలు

ఎవరి పాపాలకు వారే బాధ్యులని చెప్పడం హృదయంలో నిజమైన మార్పు రావాలని నొక్కి చెప్పడం విశేషాంశాలు. ప్రవక్త మరియు యాజకుడు అయిన యెహెజ్కేలు దేవాలయంపట్ల పరిసుద్ధత పట్ల చూపిన ఆసక్తి గమనార్హం.

**విషయసూచిక**

దేవుడు యెహెజ్కేలును ప్రవక్తగా ఏర్పరచుకోడం 1:1-3:27

యెరూషలేము వినాశనం గురించిన సందేశాలు 4:1-24:27

దేశాలమీదికి రానున్న దేవుని తీర్పు 25:1-32:32

దేవుడు తన ప్రజల కిచ్చిన వాగ్దానం 33:1-37:28

గోగు గురించి ప్రవచనం 38:1-39:29

భావికాలంలో దేవాలయం గురించి మరియు దేశం గురించి దర్శనం 40:1-48:35

**దానియేలు**-పరిచయం

యూదులు బహుదేవతారాధకుడైన శత్రురాజు అధీనంలో హింసలకు అణచివేతకు గురైన కాలంలో దానియేలు గ్రంథాన్ని రచించడం జరిగింది. దేవుడు శత్రురాజు నిరంకుశపాలనను అంతమొందించి తన ప్రజలకు అధికారాన్ని మళ్లీ ఇస్తాడనే నిరీక్షణాత్మక సందేశాలను ప్రవక్త తన దర్శనాల ద్వారా తెలియజేస్తాడు.

**విషయసూచిక**

దానియేలు, అతని స్నేహితులు 1:1-6:28

దానియేలు దర్శనాలు 7:1-11:45

(ఎ) నాలుగు జంతువులు 7:1-28

(బి) పొట్టేలు, మరియు మేకపోతు 8:1-9:27

(సి) పరలోక సందేశకుడు 10:1-11:45

(డి) యుగాంతం 12:1-13

**హోషేయ**-పరిచయం

క్రీస్తు పూర్వం 721 సంవత్సరంలో షోమ్రోను పతనం తర్వాత కష్టకాలంలో ఆమోసు ప్రవక్త అనంతరం హోషేయ ప్రవక్త ఉత్తర రాజ్యంలో విగ్రహారాధన గురించి విశ్వాసరాహిత్యం గురించి ప్రవచించాడు. హోషేయ ప్రవక్త ఒక వ్యభిచారిణిని పెళ్లి చేసుకొని దేశప్రజల విశ్వాసరహిత్యాన్ని సాదృశ్యరూపకంగా తెలియజేశాడు. అయితే దేవుడు తన ప్రజల పట్ల కృప చూపిస్తాడని దేశం మళ్లీ బాగుపడుతుందని ప్రవక్త ప్రకటిస్తాడు.

**విషయసూచిక**

హోషేయ వివాహం, మరియు కుటుంబం 1:1-3:5

ఇశ్రాయేలు గురించిన సందేశాలు 4:1-13:16

పశ్చాత్తాపం, మరియు వాగ్దానం గురించిన సందేశాలు 14:1-9

**యోవేలు**-పరిచయం

యోవేలు ప్రవక్త గురించి అంతగా వివరాలు తెలియనప్పటికీ అతను వ్రాసిన ఈ గ్రంథం క్రీస్తు పూర్వం అయిదు లేక నాలుగు శతాబ్దాల నాటిదని తెలుస్తోంది. యోవేలు అతి ఘోరమైన మిడతల దండుగురించి తీవ్రమైన క్షామం గురించి వర్ణించాడు. ప్రజలు తమ పాపాలనుండి విముఖులై తనవైపు మళ్లాలని దేవుడు కోరుకుంటున్నాడని దేవుడు తన ప్రజలను పునరుద్ధరిస్తాడని దేవుని వాగ్దానాలు నిలిచే వున్నాయని యోవేలు వివరించాడు. దేవుడు అందరిపైనా తన ఆత్మను క్రుమ్మరిస్తాడని యోవేలు ప్రవచించడం ఈ గ్రంథంలోని విశేషాంశం.

**విషయసూచిక**

మిడతల దండు 1:1-2:17

పునరుద్ధరణ వాగ్దానం 2:18-27

యెహోవా దినం 2:28-3:21

**(సశేషం)**



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

# యేసు తల్లి మరియ


ప్రపంచములో అనేకమంది స్త్రీలు మరియమ్మ అని పేరు పెట్టుకుంటారు. కారణము యేసు తల్లియైన మరియమ్మే కేంద్ర బిందువు. ఈమె ఘనురాలైన స్త్రీగా ప్రపంచ వ్యాప్తంగా కొనియాడబడింది. లోకరక్షకుడు ఈ లోకంలో జన్మించుటకు దేవుడు ఆమెను ఒక సాధనంగా వాడుకున్నాడు. మరియమ్మను దేవుడు ఎన్నుకొనుటకు ఆమెలో ఉన్న శ్రేష్ఠమైన సద్గుణములను వాక్యములో నుండి తెలుసుకుందాము.

**దీనురాలు :** "నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది. ఆయన తన దీనురాలి దీన స్థితిని కటాక్షించెను" లూకా 1:46. దేవుడు మరియను ఎన్నుకొనుటకు మొదటి కారణం ఆమెలోని దీనత్వం. ఆమె మాటలలో దీనత్వం, ఆమె సమస్త నడవడికలో దీనత్వము. హృదయములను పరిశోధించు దేవుడు మరియలోని దీనత్వమును గమనించి ఆమెను ఎన్నుకున్నాడు. "ఆయన దీనులను ఉన్నత స్థలములలో ఉంచును" యోబు 5:11. దేవుడు మనలను వాడుకొని మన ద్వారా గొప్పకార్యాలు చేయించాలంటే మొదట మనలో దీనమనస్సు ఉండాలి. మరియమ్మ లోకరక్షకునికి తల్లి కాబోతున్నానని ఎరిగియు తన దీనస్థితిని గుర్తుంచుకున్నది. అందువలన ప్రభువు ఆమెను జ్ఞాపకముంచు కొనెను.

**పరిశుద్ధురాలు :** దేవుడు మరియను ఎన్నుకొనుటకు రెండవ కారణము ఆమెలోని పరిశుద్ధ జీవితం. మరియ కన్యక. ఆమె పురుషుని ఎరుగనిది. ఆమె తన కన్యాత్వమును కాపాడుకొనినది. మరియ పరిశుద్ధత కలిగి జీవించుటకు తన్ను తాను దేవునికి సమర్పించుకొనినది. అందువలన దేవుడు ఆమె గర్భవాసములో నుండి ఈ లోకానికి రావడానికి ఇష్టపడ్డాడు.

**విధేయురాలు :** "ఇదిగో ప్రభువు దాసురాలను. నీ మాట చొప్పున నాకు జరుగును గాక! అనెను" లూకా 1:36. దేవుని దూత నీవు గర్భము ధరింతువని చెప్పినప్పుడు, అయ్యో, నేను కన్యకను నేనీ నిందను భరించలేనని ఎదురు తిరుగక దేవుని చిత్తమునకు అప్పగించుకొని విధేయత చూపెను. కన్య మరియ జీవించిన దినములలో ధర్మశాస్త్ర ప్రకారము అవివాహిత గర్భము ధరించినటో ఆమెను రాళ్ళతో కొట్టి చంపుతారు. కన్య మరియ కూడా అవివాహిత. అంతటి సంక్లిష్ట పరిస్థితులలో ఉండి కూడా "నీ చిత్తము చొప్పున జరుగును గాక" అని విధేయత చూపింది. ఘనతకు ముందు వినయముండును. సామెతలు 18:12.

**ప్రార్థనాపరురాలు:** ఆ దూత లోపలికి వచ్చి ఆమెను చూచి "దయాప్రాప్తురాలా! నీకు శుభము. ప్రభువు నీకు తోడైయున్నాడని చెప్పెను. లూకా 1:28. ఆమె ఒంటరిగా ప్రార్థిస్తున్నప్పుడు దేవుని దూత కనిపించి దేవుని తలంపులను బయలుపరచెను. మనము దైవ సన్నిధిలో కనిపెట్టినప్పుడు ప్రభువు తన ఉద్దేశ్యాలు, తలంపులు ఆయన చిత్తాన్ని బయలుపరుస్తాడు. గబ్రియేలు దూత మరియ దగ్గరకు వెళ్ళి "దేవుని వలన నీవు కృప పొందితివి" లూకా 1:30 అని చెప్పాడు. దేవదూతలను మనం ఎప్పుడు కలుసుకుంటాం? దేవుని సన్నిధిలో మనం ఎక్కువ సమయం గడిపినప్పుడు మాత్రమే వారిని కలుసుకుంటాం. దేవుని చిత్తము దేవుని ఆలోచనలు బయలుపరచబడాలంటే ఎక్కువ సమయం దేవుని సన్నిధిలో గడపాలి. మరియమ్మ దేవుని సన్నిధిలో గంటలు తరబడి గడుపుచు దేవదూతలతో సంభాషించి ఉండవచ్చును. మరియమ్మ జీవితం అందరికీ విశేషించి మహిళామణులకు ఆదర్శంగా ఉండాలి. అప్పుడు మన కుటుంబాలు మన జీవితాలు ఆశీర్వాదకరంగా ఉంటాయి. మరియమ్మవలె దీనులమై, పరిశుద్ధులమై, విధేయులమై, ప్రార్థనాపరులమై ప్రభువుని వెంబడించి ప్రభువుకు ప్రియ బిడ్డలముగా జీవించి ఆయన పరమ రాజ్యమును పొందుకొనుమని ప్రేమతో మనవి చేయుచున్నాను. దేవుడు మిమ్ములను దీవించును గాక!



# రక్షకుని బయలుపరచిన గ్రంథము - బైబిలు

బ్రదర్ కె.సామ్రాట్

"మా మట్టుకు మేము విని ఈయన నిజముగా లోక రక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి (యోహాను4:42)

బైబిలు ద్వారా యేసుక్రీస్తు రాలేదు కాని, యేసుక్రీస్తు ద్వారానే బైబిలు మనకు అనుగ్రహించబడినది. గాని యేసు క్రీస్తు గూర్చి సంపూర్ణ సత్యము సత్యవేదములో సవివరముగా వివరించబడెను. ఆయన సంపూర్ణ దేవుడైయుండి సర్వలోక మానవకోటి పాపపరిహారార్థమై ఈ లోకములో మానవుడుగా అవతరించెను. ఆయనయందు దైవత్వము మానవత్వము ఏకీభవించెను.

## ఆయన దైవత్వము

**1. ఆయన సర్వకాలములోనున్నవాడు:** నిత్యుడు ఆయన అన్నిటికంటే ముందుగా వున్నవాడు (కొలస్సీ. 1:17). ఆయన యుగయుగములకు సజీవుడైయున్నాడు (ప్రక. 11:18). "నేనే అల్ఫాయు, ఓమెగయు, మొదటి వాడను, కడపటివాడను, ఆదియు అంతమునైయున్నాను" (ప్రకటన 22:13).

**2. ఆయన సర్వసృష్టికర్త:** సమస్తము ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలిగియుండ లేదు (యోహాను 1:1-3) లోకమాయన మూలముగా కలిగెను (యోహాను1:10). "ఏలయనగా, ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైవి గాని అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను సర్వమును ఆయన ద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను (కొలస్సీ. 1:16)

**3. ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు:** (కొలస్సీ1:17) భూమి, ఆకాశములోని సమస్త మండలముల సర్వమునకు ఆయనే ఆధారభూతుడైయున్నాడు. తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచున్నాడు (హెబ్రీ. 1:4) అనగా జరిగించుచున్నాడు. సృష్టిక్రమము చొప్పున గ్రహములు తమ తమ పథములలో నియమింపబడిన కాలములో జరుగును. సూర్యుడు భూమిని ఆకర్షించును. భూమి చంద్రుని ఆకర్షించును, ఈలాగు ఒకదానితో ఒకటి ఆకర్షణ శక్తి కలిగించి జరిగించుచున్న వాడు ప్రభువైన యేసుక్రీస్తే!

**4. ఆయన సర్వాధికారి :** శరీరమునుబట్టి క్రీస్తు వీరిలో పుట్టెను. ఈయన సర్వాధికారియై దేవుడైయుండి నిరంతరము స్తోత్రార్హుడైయున్నాడు (రోమా 5:9).

ఆయన రోగములపై, మరణముపై అధికారము కల వాడు. గ్రుడ్డివారు చూపు పొందుచున్నారు, కుంటివారు నడచు చున్నారు, కుష్ఠరోగులు శుద్ధులగుచున్నారు, చెవిటివారు వినుచున్నారు. చనిపోయిన వారు లేపబడుచున్నారు. బీదలకు సువార్త ప్రకటింపబడుచున్నది (మత్తయి 11:5). యోహాను 11:43,44 నాలుగు దినముల క్రితము చనిపోయి సమాధి చేయబడిన లాజరును బ్రతికించెను. సృష్టిపైన అధికారము కలిగియుండెను. ఆయన గద్దింపగా గాలియు, సముద్రమును నిమ్మళమాయెను (మత్తయి 8:26,27). సముద్రము మీద నడిచెను (మత్తయి 14:24-27). నీళ్ళను ద్రాక్షారసముగా మార్చెను. ఐదు రొట్టెలు, రెండు చేపలు ఐదువేలమందికి పంచిపెట్టి మిగిల్చెను. మార్కు 6:38-44. ఆయన దురాత్మలపై అధికారము కలిగిన వాడు. సేన అను దయ్యములు పట్టిన వానిని బాగుచేసెను. ఏడు దయ్యములు పట్టిన మగ్ధలేనే మరియను బాగుచేసెను. లూకా 8:2; 27-39. పాపములు క్షమించుటకు అధికారము కలవాడు (మార్కు 21:10). తీర్పు తీర్చుటకు అధికారము గలవాడు (యోహాను 5:22,23)

**5. ఆయనే సర్వశక్తి సంపన్నుడు:** "సమస్తమును తనకు లోబరుచుకొన జాలిన శక్తినిబట్టి ఆయన మన దీన శరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును" (ఫిలిప్పీ. 3:21)



శ్రీమతి కమలా సామ్రాట్

# రక్షకుడు

యేసుక్రీస్తు అను గ్రీకు పదములకర్థమేమనగా 'రక్షణాభిషిక్తుడు'. తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షిచును గనుక ఆయనకాపేరు పెట్టబడెను (మత్తయి 1:21). పాపులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకై క్రీస్తు సిలువ వేయబడెను (మత్తయి 20:28). తన ప్రాణము బలిగా పెట్టుటకును దానిని తిరిగి తీసికొనుటకును తనకు అధికారము కలదని క్రీస్తు చెప్పెను (యోహాను 10:17). రక్తము చిందింపకుండా పాపక్షమాపణ కలుగదు (హెబ్రీ. 9:22). కనుక క్రీస్తు సిలువ వేయబడెను.

కృపాసత్యముల వలన దోషమునకు ప్రాయశ్చిత్తము కలుగును (సామెతలు 16:6). ప్రాణదానము చేయనిదే ప్రపంచమునకు పుణ్యము లేదు. మరియు కృపాసత్యములు కలిసికొనవు. కాబట్టి క్రీస్తు సిలువ వేయబడెను.

ప్రజాపతి మరణమును జయించి మానవునకున్న మరణ భయమును బాపవలసియున్నది. కావున ఆ పిల్లలు (మానవులు) రక్తమాంసములుగలవారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలముగల వానిని అనగా సాతానును మరణము ద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణ భయముచేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకును, ఆయన కూడ రక్తమాంసములలో పాలివాడాయెను (హెబ్రీ. 2:13,14). కాబట్టి మరణమును జయించి మరణ దాసత్వము నుండి మర్త్యులను రక్షించుటకు క్రీస్తు సిలువ వేయబడెను.

పూర్వకాలమందు ఆర్యులేమి, అనార్యులేమి, యూదులేమి యొనర్చిన ఆయా యజ్ఞయాగములు రాబోవు దాని ఛాయయేగాని నిజస్వరూపము క్రీస్తులో యున్నది (కొలస్సీ. 2:17). కావున వాటికి సంపూర్ణ కలిగించుటకై క్రీస్తు సిలువ కప్పగించుకొనెను. క్రీస్తు మన పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్కబలిని అర్పించి ఒక్క అర్పణచేత ఈయన పరిశుద్ధపరచబడిన వారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు (హెబ్రీ. 10:10-14).

సకల మానవులు పాపపురుషుని జయించలేక ఓడిపోయిరి. క్రీస్తు ఆ పాపపురుషుని జయించి సిలువచేత ఓడించి వాని ప్రధానులను, అధికారులను నిరాయుధులుగా చేసి జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా కనుపరచుటకై సిలువ వేయబడెను (కొలస్సీ. 2:15).

మన పాపములను మనము దేవునికి శత్రువులమై యుండగా క్రీస్తు మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడినవారమై, ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము (రోమా 5:10). క్రీస్తు అన్నిటికంటే ముందుగా ఉన్నవాడు. ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు. ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు, ఆయన సిలువ రక్తముచేత సంధిచేసి ఆయన ద్వారా సమస్తమును అవి భూలోకమందున్నవైనను పరలోకమందున్నవైనను వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచుకొనవలెననియు తండ్రికి అభీష్టమాయెను. గనుక క్రీస్తు సిలువ వేయబడెను (కొలస్సీ. 1:17,22)

అందరి కొరకు ఒకడు మృతినొందెను గనుక అందరును మృతినొందిరనియు, జీవించు వారికమీదట తమ కొరకు కాక తమ నిమిత్తము మృతినొంది తిరిగి లేచిన వానికొరకే జీవించుటకు క్రీస్తు అందరి కొరకు మృతి నొందెననియు నిశ్చయించు కొనుటకై యేసు సిలువ వేయబడెను (1కొరింథీ. 5:14)

**Wish You Happy Christmas & New Year**

# క్రిస్మస్ - యేసు ఎక్కడ?

ప్రభువునందు ప్రియ పరిశుద్ధత పాఠకులకు క్రిస్మస్ శుభాభివందనములు.

2014 డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు అయిపోయిన తరువాత మరలా ఎప్పుడో సంవత్సరానికి కదా ఈ ప్రపంచ పండుగ అని అనుకున్నాము. క్రిస్మస్ పండుగ ఫాస్ట్‌గా వచ్చేసింది. సంవత్సరకాలం ఇట్టే గడిచిపోయింది. వచ్చేసింది... క్రిస్మస్... యేసు జన్మదిన పండుగ... వచ్చేసింది...

ప్రపంచమంతా యేసుప్రభువా నీ జన్మదిన పండుగ ఎంతో సంబరంగా చేసికొని ఆనందిస్తున్నాము అని తమ కార్యముల ద్వారా అనగా, స్టార్స్, చర్చస్ అలంకరణ, ఇండ్లకు రంగులు వేయటం, ఖరీదైన వస్త్రాలు, మంచి భోజనాలు, బంగారు నగలు అలంకరణ, క్రొత్త వస్తువులు కొనుక్కోవడం వంటి లోకసంబంధ మైన కార్యక్రమాల ద్వారా తెలియజేస్తుంటాము.

అయితే ప్రాముఖ్యమైన విషయం ఏంటంటే ఈ పండుగ యేసు జన్మించిన పండుగ కనుక యేసును సంతోషపరచాలి. కానీ ఆ సంగతి ఎంతమంది గ్రహిస్తున్నారు? ఎవరి జన్మదిన వేడుకలో వారినే సంతోషపరచాలి, వారికి మంచి వస్తువులు కానుకలు, ఆభరణాలు ఇచ్చి సంతోషపరచాలి. మరి క్రైస్తవులు. మరి క్రైస్తవులు ఏంటి? యేసు జన్మదినమున ఆయనను సంతోష పరచకుండా వాళ్ళని వాళ్ళే సంతోష పరచుకుంటారు. సంతోషిస్తే పరవాలేదు కానీ, జన్మదిన కారకుడైన యేసుని బహుగా దుః ఖపరచి వాళ్ళే సంతోషిస్తున్నారు. ఇది ఎంత అన్యాయము. “అన్యాయస్థులు దేవుని రాజ్యములో ప్రవేశింపనేరరు”. ఈ పండుగ మనము అన్యాయం జరిగిస్తే పై మాట గుర్తుంచుకోండి.

అసలు మనం మనలని ఎల్లప్పుడు సంతోషింప చేసి కొంటాము కదా, ఈ ఒక్కరోజైనా యేసుని సంతోషపరచే విధంగా పండుగ చేసుకుంటే యేసు ఎంత ఆనందిస్తాడు. క్రిస్మస్ సంద ర్భంగా యేసుకి నూతన వస్త్రాలు, మంచి భోజనం, కానుకలు, ఆపదలో, ఇబ్బందులలో, అవమానములలో ఉన్నవారిని దర్శించి వారిని ఓదార్చి తగిన సహాయం చేయటం (నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించుట), బీదలకి, దిక్కులేని వారికి మంచి వస్త్రాలు, భోజనాలు ఇస్తే యేసుకే ఇచ్చినట్లు కదా. అదే దేవుడు కోరేది (యాకోబు1:2). అలా చేస్తే దేవుడు ఎంత సంతోషిస్తాడో కదా! ఆయన సంతోషిస్తే మనకు ఎన్ని దీవెనలో. అయితే మనం యేసు జన్మదిన సందర్భంగా అధిక పాపములు చేసి ఆయనను రోజూ కంటే ఎక్కువగా దుఃఖపరుస్తున్నాము.

క్రిస్మస్ సందర్భంగా మనం దేవుని దుఃఖపరచే విషయాలు :

1. యేసుకి (పేదలకి) ఇవ్వవలసిన క్రొత్త వస్త్రాలు మనమే వేసుకుంటాము. కొంతమంది దయగలవారు పేదలకు చినిగినవి, పాతవి, పనికిరానివి పేదలకు (యేసుకి) ఇచ్చి, తాము ఖరీదైన వస్త్రాలతో అలంకరించుకుంటారు.

2. మంచి భోజనం మనకు. ఎంగిలి భోజనం అనగా మనం తినగా మిగిలిన భోజనం పేదలకి (యేసుకి).

3. త్రాగుడు, జూదము, వ్యభిచార సంబంధమైన క్రియలు ఆ రోజే ఎక్కువగా చేసి విరోధి అయిన సాతానుని సంతోష పరచి యేసుని బహుమా దుఃఖపరుస్తాము.

4. క్రిస్మస్ సందర్భంగా మంచి మంచి ఖరీదైన నగలు, వస్తు వాహనాలు ఇంటిలోనికి తెచ్చుకుంటాము కానీ యేసుని బయటనే నిలబెడతాము.

5. అసలు వెలుగైన క్రీస్తుని కాకుండా గాలికొడితే ఆరిపోయే క్యాండిల్స్‌తో సంబరపడతుంటాము (యోహాను1).

6. క్రిస్మస్ రోజు దేవదూతలు పరలోకంలో గానం చేసి దేవుని మహిమపరచారు. ఆ సందర్భంగా మన ఇళ్ళలో చీకటి శక్తులు నాట్యం చేస్తున్నాయేమో ఆలోచించండి.

7. జన్మదిన కారకుడైన యేసు లేకుండానే క్రిస్మస్ వేడుకా? క్రీస్తులేని క్రిస్మస్ ఎంత విడ్డూరం! ఎంత అన్యాయం!

దయచేసి విజ్ఞులైన మీరందరూ ఆలోచించండి. ఈ క్రిస్మస్ అయినా క్రీస్తును సంతోషపరచే విధంగా జరుపుకుందాము. హృదయాలలో నివసించే యేసు హస్తకృత్యములలో నివసింపడు. మనం ఆలయాలని ఎంతో అలంకరించుకుంటాము కానీ, యేసు నివసించేది హృదయాలలో కనుక, మన హృదయాలను పవిత్ర పరచుకుందాము. యేసు నివసించునట్లుగా మన హృదయాలను అపవిత్రపరచే వాటిని (మార్కు 7:21) తొలగించుకొని యేసు మనలో జీవించునట్లు మన హృదయాలని పవిత్రపరచుకొని (నిర్గమ. 25:8) యేసుని సంతోషపరచి దీవెనలు పొందుదాము. యేసుని కలిగి యేసులో క్రిస్మస్ పండుగ చేసికుందాము.

# పాపుల రక్షకుడేసు



రెవ.డా॥ కె.జోసఫ్

యేసుప్రభువు ఈ లోకమునకు పాపులను రక్షించుటకు వచ్చినవాడు (1తిమో. 1:15). యేసుప్రభువు ఈ లోకములో జన్మించి తన గొప్ప క్రియల వలనగాని, అద్భుతాల వలనగాని దేవుడు కాలేదు. అసలు ఈయన పుట్టక ముందు కొన్ని వేల సంవత్సరముల నుండి ఆయా దేశాలలో ఆయా మత ప్రవక్తలు "యేసు" అనే లోకరక్షకుడు పుట్టునని ప్రవచించారు.

పాపక్షమాపణ రక్తప్రోక్షణ వలననే కలుగునని కూడా వేదాలు చెపుతున్నాయి. ధర్మశాస్త్ర ప్రకారము సమస్త వస్తువులు రక్తముచేత శుద్ధి చేయబడుననియు, రక్తము చిందింపకుండ పావ క్షమావణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును. అందువలననే ఆయా దేశాలలో జంతుబలులు జరుగుతుండేవి. ఇప్పటికి కూడా జరుగుతునే వున్నాయి. అయితే ఆ రక్తము పవిత్రమైన రక్తముగా ఉండాలి. అందుకని జంతువులలో, పక్షులలో కొన్నిటిని పవిత్రమైన వాటిగా ఎంచి వాటిని బలి ఇస్తుండేవారు. కొంతమంది చిన్నపిల్లలను పసికందులను కూడా బలి ఇచ్చేవారు. ఎందుకంటే వారికి ఏ పాపము లేదని వారి నమ్మకము. అయితే మానవుడు జన్మతాః పాపి అని వారు గ్రహింపరు. అసలు భూమి మీద జంతువులు కానీ, పక్షులు కానీ, మరేదైనను పవిత్రమైనది కాదు.

అయితే దేవుడు మనలని ప్రేమించి, మనం బలహీనులమని, మంటివారమని, మనం ఏమి చేసినా అంటే ఎన్ని యజ్ఞాలు, యాగాలు చేసినప్పటికీ మన పాపముల నుండి మనం విడుదల పొందలేమని ఎరిగి, తన కుమారుని పాపపరిహారార్థం పంపుటకు కాలము సంపూర్ణము కాలేదు గనుక జంతుబలికి, పక్షులబలికి ఒప్పుకున్నాడు. "గత కాలములో సమస్త జనులను తమ తమ మార్గములయందు నడువనిచ్చెను" (అపొ.కార్య. 14:16)."ఆ అజ్ఞాన కాలములో దేవుడు చూచి చూడనట్లు ఊరకుండెను" (అపొ.కార్య.17:30), "కాలములు సంపూర్ణ మైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను" (గలతి.4:4).

అంతేకాక దేవుడు నరబలిని కోరడు. కరుణామయుడైన దేవుడు మన పాప విముక్తి కొరకు కాలములు సంపూర్ణమైన పిమ్మట తన కుమారునే పంపవలసి వచ్చింది.

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాస ముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందు నట్లు ఆయనను అనుగ్రహించెను" యోహాను 3:16

యేసే నిజమైన లోకరక్షకుడు పాపహరుడు అని మన హిందూ మత గ్రంథాలలో ఉన్న ఋుజువులు ఈ క్రింద ఇయ్యబడినవి జాగ్రత్తగా పరిశీలించండి. అన్ని మతాలలో పాపపరిహారమునకు రక్తప్రోక్షణ అవసరమని వ్రాయబడి ఉన్నది. అయితే ఆ రక్తము పాపరహితంగా ఉండాలి. సృష్టిలో ఏ ప్రాణం పాపము లేకుండా రాలేదు. అందుకని

## మన వేదాలలో...

"తైత్తిరియా అరన్యక" 3వ వచనములో "సర్వపాప పరిహారో రక్తప్రోక్షణమావశ్యం". అంటే పాపక్షమాపణ రక్త ప్రోక్షణ వలననే జరుగుతుంది అని అర్థం. అయితే ఆ రక్తం పాపంలేని పవిత్రప్రాణిదై యుండవలెను. ప్రపంచంలో ఏ మనిషిగాని, జంతువుగాని పాపరహితమైనదిగా లేదు కనుక మరలా తైత్తిరియా అరన్యక 4వ వచనములో "తద్ రక్తం పరమాత్మనా పుణ్యదాన బలియాగము" అనగా ఆ రక్తం దేవునిదే అయివుండవలెను" అని వ్రాయబడి యున్నది. పురుష సూక్త ఏమని చెబుతుందంటే పురుష ప్రజాపతి బలికంటే వేరే మార్గములేదని చెబుతుంది.

"పురుషా వావా యజ్ఞ చందోక్య" ఉపనిషద్. పరమ పురుషుడైన దేవుడే బలికావలెను. రిగ్వేద ప్రకారం పాప పరిహారార్ధ బలి చేయబడే పురుషకి కావలసిన యోగ్యతలు.

**1. నిష్కళంక పురుష :** కాత్యానా స్రతో సూత్రము 6వ అధ్యాయములో జంతువులలోని నిష్కళంకమైనవి ఉండవు. కనుక వాటిని శుద్ధి చేయుటకు నిప్పు నీరులో శుద్ధి చేయవలయును.

**2. బలి చేయబడే పురుష ప్రత్యేకించబడాలి :** గుఱ్ఱమును బలి చేయనప్పుడు అది మిగతా వాటన్నిటి నుండి వేరు చేయవలెను. అందుకు గుర్తుగా ఒక చిన్న ముండ్ల పొద (అల్లిక)ను ఆ గుర్రము తలమీద సాధారణంగా వుంచుతారు. సత్‌పతా బ్రాహ్మణ 13వ కాండ 6:22లో ఆ గుర్రపు తలను పురుషగా పరిగణించాలని చెప్పబడింది.

**3. ఈ పురుష తన స్వంత వారిచేత అంగీరింపబకూడదు.** ఈ బలిపశువు తన తల్లి, తండ్రి, అన్నదమ్ములు అక్కచెల్లెలు మరియు స్నేహితులచే నిరాకరింపబడవలెను అని ఐతర్వ బ్రాహ్మణ 2:16లో వ్రాయబడివుంది.

**4. యజ్ఞ పురుష ఈ బాధలను మౌనంగా సహించాలి:** ఋగ్వేద 5:46లో నాకు బాగుగా తెలిసే నేను కాడిని తగిలించుకున్నాను మరియు నేను విడుదల కోరలేదు వెనక్కి తిరుగనూలేదు.

**5. పురుష ఒక స్థంభమునకు కట్టబడాలి:** సతపతా బ్రాహ్మణలో బలిపశువును స్థంభమునకు కట్టబడకుండా బలిచేయకూడదు. న-వరుతే-యాపాల్-పసుమ్-అలబాతే కరాచన (111-7:3-1). అంటే బలిచేయక ముందు ఆ బలిపశువు ఖచ్చితంగా ఒక గుంజకు కట్టివేయబడాలి. ఇది చాలా ముఖ్యము. ఆ గుంజ 'యూపస్థంపా' (బలిచేసే స్థంభము పేరు).

**6. బలికాబడే నరుని యొక్క రక్తము కారవలెను:** బృహద్-అరణ్యక-ఉపనిషద్ (3.9.28.2) లో ఏమి చెపుతుందంటే "త్వచా-ఎవాస్యా-రుధిరమ్-ప్రస్యోంది- త్వచా-ఉత్పృతా-తప్యాత్తదరున్నాత్-ప్రయితి-రసో-విరుక్షాది-వాహతాత్"

నరుకబడిన చెట్టు నుండి రసమేవిధంగా కారుతుందో ఆ విధంగానే పురుష రక్తం కారుతుంది.

**7. బలిపశువు యొక్క ఎముకలు విరువబడకూడదు.**

ఐతరేయ బ్రాహ్మణ 2:6లో బలి కార్యక్రమము చేసే వ్యక్తి ఆ బలిపశువులోని 26 ప్రక్కటెముకలను విరగకుండా వేరుపరుస్తాడు.

**8. బలికాబడిన పురుష మరలా జీవించాలి.**

"బృహుద్-అరణ్యక-ఉపనిషద్
యద్-వృక్షో-వృక్షనో-రోహితి-ములనా
వలౌరహపున-మర్తీయ-స్విన్ మృత్యునా
వృక్న-కస్మానమోలాత్-ప్రరోహతి
రెతౌస-ఇతి మానోకేట-జీవాతస్తాల్
ప్రజాయతె-ధనరుహ్-ఎ-ఐవా వాయి క్రవ్
వృక్షో-అన్‌జప్సా-ప్రెత్య-సంభలితా"

దీనిభావమేమంటే - చెట్టు నరకబడితే అది వేరు వలన మరలా మరలా చిగురిస్తుంది. అయితే మర్త్యుడైన మానవుడు చనిపోతే ఇక జీవించడు. జీవించడానికి వేరు ఉండదు. మరణించిన వ్యక్తిలో నుండి ఏ విధమైన జీవము గలది రాదు. మనిషి పుట్టటానికి 'వీర్యము' కావాలి. అయితే మరణించిన వ్యక్తిలో నుండి ఏ వీర్యము రాదు. అయితే 'పురుష' అనబడే ప్రజాపతి స్వయంగా తానే బ్రతుకుతాడు. (చనిపోయి తనకు తానే జీవిస్తాడు).

**9. ఆ పురుష యొక్క శరీరము భక్తులు ఆరగించాలి :**

సత్‌పతౌ బ్రాహ్మణ (5.1.1.1.2)లో ప్రజాపతి తనకు తానే వారికి సమర్పించుకున్నాడు అని వ్రాయబడింది. కనుక ఆ అర్పణ వారి ఆహారము.

**10. ఈ త్యాగము అందరి కొరకు :**

పురుష సూక్త 8వ అధ్యాయములో ఇలా వుంది.
తస్మాద్ యజ్ఞాల్ సర్వాహుతౌ-పసుద్‌తన్సుకార్కె
వోయార్యా-నానన్‌యాన్-గ్రామ్యాస్కా-ఎ

ఈ బలివలన నెయ్యి చల్లుట అన్ని రకముల జంతువులు ఆకాశంలోని, అడవులలోనివి పుట్టుకు వచ్చినవి నెయ్యి చల్లుట మూలమైన బలికి సాదృశ్యము. పురుష సూక్తలోని 9వ వచనము ఏమంటే, ఈ బలి వలన పురుష తన సర్వస్యము అర్పించియున్నాడని 'ఋగ్, సామ, యజుర్వే దాలును మరియు చాందస్‌లోను వ్రాయబడి వుంది.

పాపపరిహారార్థబలిగా బలి చేయబడే వ్యక్తికి మన వేదముల ప్రకారము ఉండవలసిన 10 యోగ్యతలు ఎంత ఖచ్చితంగా యేసుకు ఉన్నవో లేవో పరిశీలించండి.

**1. యేసులో ఏ పాపము లేదు :**

**పాతనిబంధన ప్రకారము–** కళంకమున్న దానిని మీరు అర్పింపకూడదు. అంది అంగీకరించబడదు (లేవి. 22:20). “అది మగదేకాని, ఆడుదేకాని నిర్దోషమైనదిగా ఉండవలెను” (లేవీ. 3:11).

**క్రొత్తనిబంధన ప్రకారము–** ఆయనలో (యేసులో) ఏ పాపము లేదు. హేరోజు రాజు కోర్టులోను, పిలాతు కోర్టులోను యేసులో ఏ దోషము లేదని తీర్పు చెప్పటం జరిగింది. మత్తయి 27:24 4వపాదము “నీతిమంతుని రక్తమును” లూకా 23:14,15 ఈ మనుష్యునియందు నాకు ఏ నేరము కనబడలేదు. 15వ. హేరోదునకు కూడా ఏ దోషము కనబడలేదు.

**2. యేసుక్రీస్తు ఇతరుల నుండి ప్రత్యేకించబడిన వాడు:**

యోహాను 19:2లో ఆ రాణువ వారు ముండ్లతో అల్లిన కిరీటము యేసు శిరస్సున నుంచి ఊదారంగు వస్త్రము ఆయనకు తొడిగించి యేసుని ప్రత్యేకపరచెను (యోహాను 19:2).

**3. యేసు తన స్వజనులచే తిరస్కరించబడ్డాడు:**

ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను. ఆయన స్వకీయులు ఆయనను అంగీకరించలేదు (యోహాను 1:11). అతడు తృణీకరింపబడిన వాడాయెను. మనుష్యుల వలన విసర్జింపబడిన వాడాయెను (యెషయా 53:3). ఆఖరికి తండ్రిచేత కూడా విడువబడిన వాడాయెను. నా దేవా నా దేవా నన్నేల చేవిడితివి (మత్తయి 27:46).

**4. యేసు నిశ్శబ్దంగా శ్రమలను అనుభవించాడు:**

అతడు దౌర్జన్యము నొందెను. బాధింపబడినను నోరు తెరవలేదు... మౌనంగా ఉండునట్లు అతడు నోరు తెరువ లేదు (యెషయా 53:7).

**5. యేసు బాధింపబడినాడు :**

ఉత్సవబలి పశువును త్రాళ్ళతో బలిపీఠపు కొమ్ములకు కట్టుడి (కీర్తన 118:27)

**6. యేసుక్రీస్తు తన రక్తము చిందించినాడు:**

ఆయన సిలువకు మేకులతో కొట్టబడి రక్తము చిందించాడు. మేకల యొక్కయు కోడెల యొక్కయు రక్తముతో కాక (పాపములను ఎన్నటికీ తీసివేయలేని జంతువుల రక్తముతో కాక) తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను.

**7. ఆయన ఎముకలలో ఒక్కటైనను విరువబడలేదు** (యోహాను 19:33)

**8. యేసుక్రీస్తు మరణమును జయించి తిరిగి లేచెను :**

దీనికి బైబిల్‌లో అంటే సత్యవేదంలో ఎన్నో ఋజువులు ఉన్నాయి. అపొ.కార్య. 10:40, 1కొరింథీ. 13:20.

9. యేసు తన శరీరమును తినుటకు విశ్వాసులకు ఇచ్చారు. వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టె పట్టుకొని విరిచి వారికిచ్చి ఇది మీ కొరకైన నా శరీరము. మీరు తీసికొని తినుడి (మత్త. 26:26–27).

**10. యేసుక్రీస్తు అందరికి ప్రభువు :**


అందరి వాడు. మన అందరి కొరకు తన కుమారుని బలిగా ఇచ్చిన దేవుడు... (రోమా 8:32).

పైన చెప్పబడిన పది యోగ్యతలు క్రీస్తుకే సరిపోయినవి. కనుక పాప పరిహారుడు, దేవుడు క్రీస్తే. విజ్ఞులైనవారు ఆలోచించండి.

**యేసుక్రీస్తే పాపహరుడు**

# Happy Christmas

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**




# సువార్తలను గురించి...

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసు క్రీస్తు నామమున శుభాభి వందనములు. మీ అందరికి క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

సువార్త అనగా మంచివార్త సువార్తను నాలుగు వేరు వేరు మనుష్యులచే రచింపబడినది. ప్రతి ఒక్కొక్క ఉద్దేశ్యము కలిగి పరిశుద్ధాత్మ ప్రేరణతో వ్రాసిరి. మత్తయి సువార్త, మార్కు సువార్త, లూకా సువార్త. ఈ మూడును యోహాను సువార్తతో పోల్చి చదువుకున్నప్పుడు వాటి పోలిక మత్తయి 58%, మార్కు 93%, లూకా 42%, యోహాను 8% కలిగియున్నవి. సమదృక్పథ సువార్తలు యేసుక్రీస్తు యొక్క మానవత్వాన్ని గురించియు మరియు ఆయన చేసిన కార్యాల్ని చెపుతాయి. అవి యోహాను సువార్తకంటే ఎక్కువగా సూచక క్రియలను గురించి చెబుతాయి. యోహాను ఎక్కువగా దేవుని యొక్క దైవత్వమును గురించియు ఆయన ఎవరైయున్నాడో తెలియ పర్చుతుంది. సమదృక్పథ సువార్తలు యేసుక్రీస్తు గలిలయలో చెప్పిన దేవుని రాజ్య ప్రకటనను చూపిస్తుంది యోహాను యెరూషలేములో యేసుక్రీస్తును గురించి ఈ విధముగా ప్రకటించుచున్నాడు. దేవుడైయున్న యేసుక్రీస్తు శరీరధారిగా మన మధ్య నివసించెను. యోహాను తన సువార్తలో యేసుక్రీస్తు ప్రజలతో తనకున్న సంబంధాలను, సంబాషణలను గురించి చెప్పుచున్నాడు. నాలుగు జీవులు నాలుగు సువార్తలను గురించి తెలియజేస్తున్నాయి. (ప్రక 4:7).

**మత్తయి సువార్త** – యేసును యూదా గోత్రపు సింహముగా చూపుచున్నది. ఇది యూదా ప్రజలను దృష్టిలో పెట్టుకొని వ్రాయబడినది. అందువలన పాతనిబంధనలోని 29 సంఘటనలను గూర్చి చెప్పబడింది. యేసును రాజుగా చూపించుచున్నది.

**మార్కు సువార్త** – యేసు క్రీస్తును సూటిగా, సూక్ష్మముగా ఎక్కువగా మానవత్వ దృక్పధముతో రోమీయులు కొరకు వ్రాయబడినది. అందువలన ఆయన యొక్క దైవశక్తి ఆయన యొక్క జయ జీవితమును గురించి వ్రాయబడినది.

**లూకా సువార్త** – ఆయన యొక్క సేవా పరిచర్య జీవితమును మరియు బలిపశువుగా ఉపయోగింపబడుటయు నేర్చుకుంటాము. ఆయన ఒక సేవకుడుగా చూపబడినాడు. గ్రీకులకు వ్రాయబడినది గనుక ఒక సంపూర్ణమైన, స్వచ్ఛమైన మానువుడుగా చూపించబడినది.

**యోహాను సువార్త** – ఇది సమస్త ప్రపంచానికి కావలసిన సువార్త అని చాటుతుంది. పక్షిరాజుకు కలిగిన చాలా గుణ లక్షణాలు కలిగినది ఈ సువార్త. అందు వలననే యేసు క్రీస్తుకు, ఆయన పరిశుద్ధతకు రక్షణకు సాదృశ్యముగానున్నది. సింహము, గొర్రెపిల్ల మరియు మనిషి అందరను భూమి మీదనే ఉందురు. కాని పక్షిరాజు ఆకాశములో ఎత్తైన ప్రదేశములో ఎగురుగలదు. అందువలన యేసు క్రీస్తు పరలోక వాసి అని చాటి చెప్పుచున్నది.

మత్తయి వ్రాసిన సువార్త : నీతి బోధ ముఖ్యమైన నీతి ఏమనగా యేసు మెస్సయ్య అనియు రాజు అనియు (మత్త 2:2, 21:5, 22:11, 25:34, 27:11, 27:42) యూదుల కొరకై వ్రాయబడినది. ప్రకటించబడిన మెస్సయ్య కొరకు ఎదురు చూచేవారి కొరకు యేసే ఆ మెస్సయ్య అని ఋజువు పరుచునట్లుగా మత్తయి లేఖనాలను గురించి చెప్పుచూ, ప్రవచనములు నెరవేర్పును సూచించెను. ఆది 3:15, 22:18, 49:10; ద్వితి 18:15; యెష 2:4, 7:14, 9:6, 11:1, 28:16, 42:1, 53 మొత్తం అధ్యాయం యిర్మీ 23:5, దాని 9:25, మీకా 5:2, హగ్గ 2:7, జకర్యా 33:8, 6:12,

9:9, 11:12, 12:10, 13:7 మరియు మలాకీ 3:1. పాత నిబంధనలో అనేక ప్రవచనములను ప్రస్తావించుట వలన మెస్సయ్య అనగా ఎవరు? యేసుక్రీస్తు ఆ ప్రవచనములును ఏ విధముగా నెరవేర్చినాడు అనునది. తమ మొదటి సువార్త దండ యాత్రలో పౌలు, బర్నబాలనువారి వెంట మార్కు వెంట వెళ్ళెను. కాని తరువాత అతడు యెరూషలేముకు తిరిగివచ్చెను. తరువాత రెండవ సువార్త దండయాత్రలో మార్కును వెంటబెట్టుకుని వెళ్ళమని బర్నబా కోరగా దానికి పౌలు బర్నబాల మధ్య బేదాభిప్రాయములు వచ్చినవి. మార్కు తనను సరిచేసుకొనుటకు ఒక అవకాశమివ్వవలెనని తలంచి బర్నబా పౌలు నుండి వేరై మార్కును వెంటబెట్టుకొని కుప్రకు వెళ్ళెను (అ.కా 15:36–41) జాన్ మార్కు తన సేవా పరిచర్యను జయకరముగా జరిగించెనని తర్వాత చరిత్ర తెలియజేయుచున్నది (2 తిమో 4:11; 1 పేతు 5:13). “మార్కు” అనబడిన రోమా పేరును బట్టి మార్కు రోమా పరిధిలో పెంచబడినాడు గనుక రోమీయులను దృష్టిలో ఉంచుకొని తాను సువార్త వ్రాయగలిగినాడు. సమాచారము రాబోవు గొప్ప జయశాలియైన పరిపాలకుడు. ఆయన పౌరులు, ఆధికృతలు (మార్కు 1:1–8) ఆయన మొదటిగా సాతానును జయించుట (మార్కు 1:9–13) ఆయన రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుట (మార్కు 1:14–20) ఆయన అధికారమును ఉపయోగించుటచే చేసిన కార్యములు (మార్కు 1:21, 2:12). బలవంతుడైన రాజు యొక్క శక్తిని విశదీకరించుట. ఆయన రాజ్యములోనికి మనుష్యులను సంపాదించుట అపొస్తులులు, సుంకరులు, పరిసయ్యులు, పాపులు, వ్యాధిగ్రస్తులు మరియు ప్రతి విధమైన అవసరత కలిగినవారు (మార్కు 2:13, 3:35). ఆయన రాజ్య విస్తీరణను గురించి చెప్పుట (మార్కు 4:1–34) సృష్టి మీద అధికారము, దయ్యములు మీద అధికారము, రోగముల మీద అధికారము, మరియు మరణము మీద అధికారము కలిగినవాడు (మార్కు 4:35, 5:43). ప్రజల చేత వ్యతిరేకించబడినవాడు మరియు శాస్త్రులు, పరిసయ్యుల చేత కూడ వ్యతిరేకించబడినాడు (మార్కు 7:1–23, 8:10–12) జయశాలియైన యేసుక్రీస్తు ఆయన రాజ్యమును గూర్చియు ఆయన అధికారమును గూర్చియు ఆయన శక్తిని గూర్చియు చెప్పుట. ఆయన రాజ్యములో జయశాలిగా ఉండాలంటే ఈ లోకంలో శ్రమలు అనుభవించాలి. తుదకు మరణమైనను సరే అని ఆయన శిష్యులకు నేర్పించినాడు (మార్కు 8:31–38, 10:28–45). యెరూషలేములో ఆయన రాజ్యస్థాపన అధికారమును ఆయన జయ ప్రవేశము ద్వారా తెలియపరచెను (మార్కు 11:11–11) ఆయన దేవాలయ మును శుద్ధి చేయుట ద్వారా (మార్కు 11:15–19). ఆయన తనపైన అనుమానపు ప్రశ్నలు వేసిన వారి నోళ్ళు మూయిం చుట మార్కు 11:27, 12:44. మరియు ఆయన తన మహిమతో రెండవ సారి భూమి మీదకు వచ్చుటకు ప్రకటించుట (మార్కు 13:1–37). దేవుని రాజ్యము మరియు పరలోక రాజ్యము అనుమాటలు దాదాపుగా 50 సార్లు మరియు 30 సార్లు చెప్పబడినవి. మత్తయి గ్రంధకర్త వ్రాసిన రాజ్యము పాతనిబంధనలో చెప్పబడిన దేవుని రాజ్యమే. బాప్తీస్మమిచ్చు యోహాను ప్రకటించిన దేవుని రాజ్యము ఇదే (మత్త 3:2). యేసు క్రీస్తు ఈ రాజ్యమును గురించి ప్రకటించినాడు (మత్త 4:17). సంఘము అనునది ఈ రాజ్యము యొక్క నెరవేర్పు. మరియు క్రీస్తు రెండవ రాకడలో జయకరమైన ఆ రాజ్యమును గమనించగలము.

రచయిత : ఈ సువార్తను గ్రంథస్తము చేయు క్రమములో మత్తయి యూదుల మత సంప్రదాయములను గుర్తు చేస్తూ వ్రాసినాడు. క్రొత్త నిబంధనలో మత్తయిని గురించి చాలా కొద్దిగా చెప్పబడినది. అతడు రోమా ప్రభుత్వములో ఒక పన్నులు వసూలు చేయు రెవన్యూ అధికారిగా పని చేయుచుండెను. దేవుని పిలుపు మేరకు అతడు శిష్యుడుగా ఉండుటకును, ఆ పిదప అపొస్తులుడుగా ఉండుటకును పిలువబడెను (మత్త 10:3; మార్కు 2:14)

సమాచారములు : మెస్సయ్య రాకడను గురించి (మత్త 1:1 – మత్త 4:11). మెస్సయ్య సువార్త పరిచర్య (మత్త 4:12 – మత్త 16:12). మెస్సయ్య బలి అర్పణ (మత్త 24 – మత్త 27). మెస్సయ్య జయము (మత్త 28).

మార్కు సువార్త (వ్రాసిన కాలము 67 – 70 క్రీ.శ.)

**(సశేషం)**



శ్రీమతి రిబ్కా విక్రాంత్

# బైబిల్లో పిల్లల గురించి...

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభి వందనములు. మీ అందరికి క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

**1. పిల్లలను గూర్చి బైబిల్ చెప్పుచున్నది ఏమనగా :**

వారు దేవునినుండి కలిగిన బహుమానము (ఆది 33:5). వారు దేవునినుండి కలిగిన స్వాస్థ్యము (కీర్తన 127:3). కుమారుల కుమారులు వృద్ధులకు కిరీటము (సామెత 17:6). వారి యొక్క చేష్టల ద్వారా వారు తెలియబడుదురు (సామెత 20:11).

**2. పిల్లలు ఎడల తల్లిదండ్రుల బాధ్యత :**

ప్రతి సమయమందును తమ పిల్లలకు దేవుని వాక్యము బోధించవలెను (ద్వితి 6:6-7; ద్వితి 4:9). దేవునికి భయపడునట్లు వారికి బోధించుము (ద్వితి 31:12-13). వారికి బాల్యము నుండే లేఖనములను బోధించుము (2 తిమోతి 3:14-15). బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము (సామెత 22:6). వారు తమ పిల్లల అవిధేయతనుబట్టి వారిని శిక్షించవలెను (సామెత 13:24, 22:15, 23:13-14, 29:15-17, హెబ్రీ 12:5-9). వారు తమ పిల్లలకు కోపము రేపక, వారు కృంగిపోకుండునట్లు ప్రభువు యొక్క బోధలో వారిని పెంచవలెను (ఎఫెసీ 6:4, కొలొస్స 3:21). వారు తమ పిల్లల ఎదుట మంచి మాదిరిని కనుపరచుకొనవలెను (2 తిమోతి 1:3-5).

**3. పిల్లలయొక్క బాధ్యత :**

వారు తమ సృష్టికర్తను జ్ఞాపకము చేసుకొనవలెను (ప్రసంగి 12:1-2). వారు యెహోవాను ఘనపరచవలెను (సామెత 24:21). వారు దేవుని మాట వినవలెను (ద్వితి 30:2). వారు తమ తల్లిదండ్రుల ఉపదేశమును వినవలెను (సామెత 1:8-9). వారు తమ తండ్రిని, తల్లిని సన్మానించవలెను (ఎఫెసీ 6:2, హెబ్రీ 12:9). వారు తమ తల్లిదండ్రుల ఆజ్ఞాలను గైకొనవలెను (సామెత 6:20, ఎఫెసీ 6:1). వారు తమ తల్లిదండ్రులను సంరక్షించవలెను (1 తిమోతి 5:4). వారు తమ తల్లిదండ్రుల చెడు అలవాట్లను, పద్ధతులను అనుసరించరాదు (యెహెజ్కేలు 20:18).

**4. దుర్మార్గులైన పిల్లలు :**

వారు తమ తల్లిదండ్రులను తిరస్కరించెదరు (సామెత 15:5,20). వారు తమ తండ్రిని శపించెదరు (సామెత 30:11). వారు తమ తల్లిదండ్రులకు అవమానము తెచ్చెదరు (సామెత 19:26). వారు తమ తల్లిదండ్రులకు చేటు తెచ్చెదరు (సామెత 19:13). వారు తమ తల్లిదండ్రులకు దుఃఖము తెచ్చెదరు (సామెత 17:25). వారు తమన పెద్దలను దూషించెదరు (యోబు 19:18).

**5. కొన్ని సందర్భములలో పిల్లలు పెద్దలకు మాదిరి :**

పెద్దవారైన మనుష్యులు పరలోక రాజ్యము పొందుటకు చిన్న పిల్లలవలె ఉండవలెను (మార్కు 10:15, లూకా 18:17). దేవుని యొక్క రాజ్యము ఈలాంటి వారిదే (మత్తయి 19:13-14, మార్కు 10:14). మారుమనస్సు

పొందక, చిన్నపిల్లలవలె మార్పు చెందక యుండువారు ఎన్నటికి పరలోక రాజ్యములో ప్రవేశింపలేరు (మత్తయి 18:3). పెద్దలైన వారు చిన్నపిల్లలవలె తమ్మును తాము తగ్గించుకొనవలెను (మత్తయి 18:4). పెద్దలైన వారు దుష్టత్వము విషయములో శిశువులను పోలియుండును (1 కొరింథీ 14:20).

**6. క్రైస్తవులు దేవుని యొక్క పిల్లలు :**

వారు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించినవారు (యోహాను 3:3,5). క్రీస్తును కలిగియున్నవారు దేవుని పిల్లలు (యోహాను 1:12). వారు విశ్వాసము ద్వారా దేవుని పిల్లలు (గలతీ 3:26,27). నీతిని జరిగించువారు దేవుని యొక్క పిల్లలు (1 యోహాను 3:9,10). దేవుని ఆత్మచేత నడిపించబడిన వారందరు దేవుని పిల్లలు (రోమా 8:14). మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో సాక్ష్యమిచ్చుచున్నాడు (రోమా 8:16). మనము దేవుని పిల్లలమని పిలువబడుచున్నాము. మనము దేవుని పిల్లలమే (1 యోహాను 3:1). వారు వెలుగు సంబంధులు (యోహాను 12:36, ఎఫెసీ 5:8, 1 థెస్స 5:5). వారు ప్రియులైన పిల్లలు (ఎఫెసీ 5:1). వారు విధేయులగు పిల్లలు (1 పేతురు 1:14-16). వారు పునరుత్థానపు పిల్లలు (లూకా 20:36). అయితే, కొందరు అవిధేయులైన పిల్లలగుదురు (ఎఫెసీ 5:6-7, కొలొస్స 3:6). అటువంటివారు శాపగ్రస్తులైన పిల్లలగుదురు (2 పేతురు 2:14).




## బైబిల్ క్విజ్-13 జవాబులు

1. 12వ అధ్యాయము (8 వచనాలు)
2. 13వ అధ్యాయము (13 వచనాలు)
3. 7వ నెల, 10వ దినము
4. ప్రజలలో నుండి కొట్టివేయబడును (లేవీ. 7:27)
5. 3 అధ్యాయాలు (13,14,25)
6. 7 సార్లు (లేవీ. 19:12,14,16,18,30,32,37)
7. మోలెకు (లేవీ. 20:2-5)
8. కళంకమేదైనను కలిగినవారు (లేవీ. 21:17)
9. ఎనిమిదనాడు మొదలుకొని (లేవీ. 22:27)
10. 7వ నెల మొదటి దినము (లేవీ. 23:24)
11. షెలోమీతు (లేవీ. 24:11)
12. 50వ సంవత్సరము (లేవీ. 25:11)
13. 2 సార్లు (లేవీ. 26:1,13)
14. 5వ వంతు (లేవీ. 27:31)
15. 6,03,550 మంది (సంఖ్యా. 1:46)
16. ఒక్రాను కుమారుడైన పగీయేలు (సంఖ్యా. 2:27)
17. మోషే, అహరోను వారి కుమారులు (సంఖ్యా. 3:38)
18. 8,580 మంది (సంఖ్యా. 4:48)
19. 7వ అధ్యాయము (90 వచనాలు)
20. పాపపరిహారార్థ, అపరాధపరిహారార్థ, సమాధాన, దహన బలులు (సంఖ్యా. 6:11-15)
21. ఏనాను (సంఖ్యా. 7:78)
22. 50 ఏండ్లు (సంఖ్యా. 8:25)
23. మొదటి నెల, 14వ దినము (సంఖ్యా. 9:4)
24. పెదాసూరు కుమారుడైన గమలీయేలు (సంఖా. 10:23)
25. కిబ్రోతుహత్తావా (సంఖ్యా. 11:34)



# అక్షరయజ్ఞం

## క్రిస్మస్ ప్రత్యేక బైబిల్ క్విజ్

మత్తయి, మార్కు లూకా, యోహాను సువార్తల నుండి



**శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్**

1. మత్తయి సువార్తలోని ఇమ్మానుయేలు అను పేరు యెషయా గ్రంథములో ఏ అధ్యాయంలో ఉంది? (మత్తయి)
2. యేసుప్రభువు ఎక్కడ నుండి వచ్చి బాప్తిస్మము తీసుకున్నాడు? (మార్కు)
3. మరియ ఎలీసబెతుతో ఎంతకాలము ఉండెను? (లూకా)
4. పేతురు, అంద్రెయల పట్టణము ఏది? (యోహాను)
5. బాలుడైన యేసుని చంపజూచిన హేరోదు కుమారుని పేరేమిటి? (మత్తయి)
6. యేసుప్రభువు శిష్యుడైన లేవి తండ్రి పేరేమిటి?(మార్కు)
7. అన్న అను ప్రవక్త్రి యొక్క తండ్రి పేరేమిటి?(లూకా)
8. ఒకడు క్రొత్తగా జన్మించితేనేకాని అతడు దేవుని రాజ్యమును చూడదు అని యేసు ఎవరితో చెప్పెను? (యోహాను)
9. మత్తయి 4:4ను పోలిన వచనము ద్వితీయోపదేశ కాండములో ఎక్కడ ఉన్నది? (మత్తయి)
10. సేన అను దయ్యము పట్టిన వాడు స్వస్థత పొందిన తరువాత ఎక్కడ ఆ కార్యమును గూర్చి ప్రకటించెను?
11. శతాధిపతి యొక్క ప్రియుడైన దాసుని స్వస్థపరచిన తర్వాత యేసు ఏ ఊరికి వెళ్ళెను? (లూకా)
12. 5000 వేలమందికి పంచి పెట్టిన రొట్టెలు దేనితో (ఏ పిండితో) చేయబడినవి? (యోహాను)
13. అబ్రాహాము మొదలుకొని క్రీస్తు వరకు మొత్తం ఎన్ని తరములు? (మత్తయి)
14. పిల్లల రొట్టె తీసికొని కుక్కపిల్లలకు వేయుట యుక్తము కాదు అని యేసు చెప్పిన స్త్రీ ఏ దేశస్తురాలు? (మార్కు)
15. "ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను" అని యేసు ఎవరి గురించి ఎవరితో చెప్పెను? (లూకా)
16. లాజరు చనిపోయిన ఎన్ని దినములకు యేసు బేతనియ వెళ్ళెను? (యోహాను)
17. అర షెకెలు అను పన్నును యేసు తనతో పాటు ఉన్న ఏ శిష్యునికి చెల్లించమని చెప్పెను? (మత్తయి)
18. యేసుప్రభువు శిష్యులైన యాకోబు, యోహానుల తండ్రి పేరు ఏమిటి? (మార్కు)
19. యేసును చూచుటకు జక్కయ్య ఏ చెట్టు ఎక్కెను? (లూకా)
20. "ఒక మనుష్యుడు ప్రజల కొరకు చనిపోవుట మీకు ఉపయుక్తము" అని చెప్పిన ప్రధాన యాజకుని పేరు ఏమిటి? (యోహాను)

గత నెల ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :
**ఆర్. జయమ్మలాబాను,**
గుంతకల్లు, అనంతపురం జిల్లా
**ఆర్. లూధియ,**
గోగులమూడి, గుంటూరు జిల్లా

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.